# జనవాహిని

ప్రచురణ, తెలంగాణ, | సంపుటి -08 | సంచిక -59 | శనివారం 09 -12-2023 | పేజీలు -4. | వెల రూ.2/-




8లో తారక్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్




## పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీ..




## కెసిఆర్ కోసంఆస్పత్రికి ఎవరూ రావద్దు

- కార్యకర్తలకు హరీష్ రావు సూచన




## తెలంగాణ కమల దళపతిగా కిషన్ రెడ్డి తప్పుకోనున్నారా ?

- రాష్ట్ర పార్టీని ప్రక్షాళన చేయబోతున్నారా ?
-కొత్తగా పార్టీ హైకమాండ్ ఎవరికి ఛాన్స్ ఇస్తుంది ?
-పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న ల

# గాజా.. గజ గజ

- ఇజ్రాయెల్ దాడులతో దద్దరిల్లుతున్న గాజా
- ఎక్కువగా బలైపోతున్నది మాత్రం అమాయకులే
- మానవీయ సంక్షోభం అన్న మాట కూడా చిన్నదే
- చెట్టుకొకరు పుట్టకొకరుగా ప్రజలు చెల్లాచెదురు
- హమాస్ వద్ద 138 మంది బందీలు
- జైళ్లల్లో వేలాది మంది పాలస్తీనా పౌరులు
- 16,248 మంది పాలస్తీనియన్లు మృతి !
- దాడులను కొనసాగించి తీరుతామన్న ఇజ్రాయెల్



గాజా, **జనవాహిని**గాజాలో మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. బందీల విడుదల సమయంలో యుద్ధానికి చిన్న బ్రేక్ ఇచ్చారు. దీంతో అక్కడి జనాలు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత మళ్లీ బాంబుల మోత మొదలవ్వడంతో గాజా గజగజ వణుకుతోంది. గాజా ఒక నెత్తుటి నగరంలా మారిపోయింది. దాడులతో దద్దరిల్లుతోంది. ఆసుపత్రుల్లోనూ హాహాకారాలు వినిపిస్తున్నాయి. ఒక యుద్ధం వేలాది మంది అమాయకులను బలి తీసుకుంటోంది. ఎక్కడ చూసినా రక్తం ఏరులై పారుతోంది. ఎక్కడ విన్నా బాంబుల మోతలే వినిపిస్తున్నాయి. గాజా నగరం ఒక శ్మశానాన్ని తలపిస్తోంది. ప్రాణాలు కాపాడుకునే దారి లేదు. సరిహద్దులు దాటే అవకాశం లేదు. గాజా నగరం పరిస్థితి.. యుద్ధానికి ముందు.. ఆ తర్వాత అన్నట్లుగా మారింది. అసలు ఈ మారణకాండకు ముగింపు పడేది ఎప్పుడు ? గాజా భవిష్యత్తు ఏంటి ?
యుద్ధం ఏదైనా.. యుద్ధం ఎక్కడైనా.. యుద్ధం ఏ రెండు దేశాల మధ్యనైనా.. ఎక్కువగా బలైపోయేది అమాయకులే..! యుద్ధానికి కారణం ఏదైనా కావొచ్చు.. రీజన్ ఏదైనా.. ఆ యుద్ధంలో ఎక్కువగా బలయ్యేది సామాన్యులే..! ఇజ్రాయెల్ హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంలోనూ అదే జరుగుతోంది. ఇజ్రాయెల్ దాడులతో గాజా దద్దరిల్లుతోంది. హమాస్ జరిపిన మెరుపు దాడికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ దండయాత్ర చేస్తోంది. ఈ యుద్ధానికి కారణం ఎవరన్నది పక్కన పెడితే.. ఎక్కువగా బలైపోతున్నది మాత్రం అమాయకులే..! గాజా ప్రజలు పడుతున్న కష్టాల గురించి చెప్పేందుకు మానవీయ సంక్షోభం అనే మాటలు కూడా సరిపోవడం లేదు. అంత దారుణాతి దారుణంగా ఉన్నాయి అక్కడి పరిస్థితులు.

## కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోని.. ప్రజలకు సేవ చేయాలి



హైదరాబద్, **జనవాహిని** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దవాఖానలో చేరిన విషయం తెలిసిందే. గురువారం అర్ధరాత్రి ఆయన కాలు జారి కిందపడటంతో తీవ్ర గాయమైంది. ప్రస్తుతం ఆయన సోమాజిగూడలోని యశోదా ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సినీనటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ (%ఖఝఅ ఖశ్రీఝఅ%) స్పందించారు. బీఆర్ఎస్ అధినేత సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కి గాయమైందని తెలిసి బాధపడ్డాను. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఎన్నో సవాళ్లను అధిగమించిన కేసీఆర్.. ఈ అనారోగ్య పరిస్థితుల్ని కూడా మనోధైర్యంతో అధిగమిస్తారనే నమ్మకం ఉంది. పూర్తి ఆరోగ్యంతో కోలుకొని ప్రజలకు, సమాజానికి తన సేవలు కొనసాగిస్తారని ఆకాంక్షిస్తున్నా' అంటూ పేర్కొన్నారు.

# నన్ను ఎవరూ పిలవలేదు

హైదరాబాద్ **జనవాహిని** తెలంగాణ కొత్త సీఎం రేవంత్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సమీక్షకు ఇప్పటికే రాజీనామా చేసిన ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు హాజరు కాలేదు. ఆయన రాజీనామాను ఆమోదిం చవద్దని, సమీక్షకు ప్రభాకర్‌రావు హాజర య్యేలా చూడాలని గురువారం విద్యుత్ శాఖ కార్యదర్శిని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిం చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రావు సమీక్షకు గైర్హాజరవడం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యుత్ శాఖలో డిస్కంలకు ఇప్పటి వరకు రూ. 85 వేల కోట్ల అప్పులు ఉన్నాయని అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి వివరిం చారు. దీంతో అసలు శాఖలో ఏం జరుగుతోందన్న కోణంలో సీఎం అధికారులను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వారికి ఉచితంగా కరెంటు ఇస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీ అమలు కోసమే



విద్యుత్ శాఖ వ్యవహారాలపై పూర్తి అవగాహన కోసం సీఎం సమగ్ర రివ్యూ జరుపుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అంతకుముందు ఉదయమే సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ ఆదాయ, వ్యయాలపై సీఎం సమీక్షలో ఆరా తీశారు. రేపటి నుంచి ప్రారంభించనున్న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సమీక్షలో ఆర్టీసీ అధికారులకు సీఎం పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి రవాణా శాఖ త్వరలో పూర్తి మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు సమాచారం
తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో రోజుకు 12 నుంచి 13 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీపై రోజుకు రూ.4 కోట్ల దాకా భారం పడనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# విద్యుత్ శాఖ బకాయిలు 85 వేల కోట్లు

-సిఎం సమిక్షలో అధికారుల వెల్లడి - పిలిచినా హాజరుకాని ప్రభాకర్ రావు

## - తనను ఎవరూ పిలవలేదన్న సిఎండి



హైదరాబాద్,డిసెంబర్8 **జనవాహిని** వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా..ధనిక రాష్ట్రంలో విద్యుత్ శాఖ బకాయిలు 85 కోట్లు ఉన్నట్లు తేలింది. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక సమిక్షలో అధికారులు ఈ విషయం వెల్లడించారు. సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశానికి సీఎండీ ప్రభాకర్ రావు గైర్హాజరయ్యారు. ఈనెల 3న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ పదవికి ప్రభాకర్ రావు రాజీనామా చేశారు. రాజీనామా చేసినా రివ్యూకు హాజరుకావాలని సీఎం రేవంత్ ఆదేశించారు. స్వయంగా సీఎం రేవంత్ ఆహ్వానించినప్పటికీ సీఎండీ ప్రభాకర్‌రావు సమావేశానికి హాజరుకాని పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ శాఖ అంశంలో గురువారం సీఎం సీరియస్ అయిన విషయం తెలిసిందే. విద్యుత్ శాఖలో రూ. 85 వేల కోట్ల నష్టం వచ్చిందని అధికారులు చెప్పారు. సీఎండీ ప్రభాకర రావును సమిక్షకు రప్పించాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ శుక్రవారం జరుగుతున్న విద్యుత్ శాఖ ప్రత్యేక సమిక్షకు సీఎండీ ప్రభాకర్ రావు గైర్హాజరవడం చర్చనీయాంశంగా మారింది. అయితే విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో నిర్వహించిన సమిక్ష సమావేశానికి హాజరు కావాలంటూ తనను ఎవరూ పిలవలేదని ట్రాన్స్ కో, జెన్కో సిఎండీ దేవులపల్లి ప్రభాకరరావు స్పష్టం చేశారు. తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. కరెంటు లెక్కల్లో అవకతవకలు జరిగాయనీ, అవి తేలేవరకూ సిఎండీ దేవులపల్లి రాజీనామాను ఆమోదించవద్దనీ ముఖ్యమంత్రి ఆదేశించినట్లుగా వార్తలు వచ్చాయి. అలాగే విద్యుత్ శాఖపై జరిగే సమిక్షా సమావేశానికి ఆయనను పిలవాలని సిఎం అధికారులను ఆదేశించారని కూడా తెలిసింది. అయితే తనకు ఎలాంటి సమాచారం లేదని, ముఖ్యమంత్రి పిలిస్తే వెళ్లకుండా ఎందుకుంటానని దేవులపల్లి అన్నారు.



## లూటీ చేసిన ప్రతిపైసా కక్కిస్తా

### ఇది మోడీ గ్యారెంటీ అంటూ ట్వీట్

### ఎక్స్ వేదికగా మోడీ ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,డిసెంబర్8: **జనవాహిని** ప్రజల నుంచి లూటీ చేసిన ప్రతి పైసాను వెనక్కి రప్పిస్తామని, ఇది మోదీ గ్యారెంటీ అని 'ఎక్స్' వేదికపై మోదీ శుక్రవారంనాడు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాలపై ప్రధానంగా కాంగ్రెస్ పార్టీపై ఆయన తన ట్వీట్‌లో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహుతో సంబంధం ఉన్న ఒక వ్యాపార సంస్థకు చెందిన వేర్వేరు ప్రదేశాల నుంచి కోట్లాది రూపాయల నగదు ఐటీ దాడుల్లో పట్టుబడింది. ఈ కథనాన్ని తన పోస్ట్‌కు మోదీ జత చేశారు. ఈ కరెన్సీ నోట్ల గుట్టలను దేశప్రజలంతా చూసిన తర్వాత ఆ పార్టీ నాయకుల నిజాయితీ, చెప్పే ఉపన్యాసాలు వినాలని, ప్రజల నుంచి లూటీ చేసిన ప్రతి పైసాను వాపలు చేయాల్సిందేనని, ఇది మోదీ గ్యారెంటీ అంటూ పలు ఇమోజీలతో మోదీ హెచ్చరించారు. ఒడిశా, జార్ఖండ్‌లలో ఐటీ శాఖ గురువారం జరిపిన పలు దాడుల్లో వివిధ మద్యం తయారీ సంస్థలకు చెందిన రూ. 300 కోట్లు పట్టుబడ్డాయి. కేవలం ఒడిశాలోని బౌద్ధ్, రాయడిహ్, జార్ఖాండ్‌లోని రాంచీ, లోహర్‌డగ జిల్లాల్లో రూ. 150 కోట్లు పట్టుబడినట్లు అధికారులు చెబుతున్నారు.

# ప్రజాభవన్‌లో మొదలైన ప్రజాదర్బార్

- భారీగా తరలివచ్చిన ప్రజలు
- అర్జీలు స్వీకరించిన సిఎం రేవంత్
- ధరణి, భూ సమస్యలపై వినతుల వెల్లువ
- రాష్ట్రంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్న మోత్కుపల్లి

హైదరాబాద్,డిసెంబర్8: తెలంగాణ ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణస్వీకారం చేసిన రేవంత్ రెడ్డి దూకుడు ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు పాల్గొన్నారు. సామాన్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌కు సామాన్యులు తరలి వచ్చారు. తమ సమస్యలను వివరించారు. ధరణి సమస్యలు, తమ భూములు నేతలు కబ్జాలు చేశారని, డబుల్ బెడ్ రూంలు ఇప్పించాలని, అడ్వకేట్ రైట్స్ యాక్ట్ రూపకల్పన చేయాలని, టీచర్ 317 జీవో ఇవ్వాలని కోరారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిని కలవడానికి కొంత మంది కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చారు. కాగా ప్రజాదర్బార్ కార్యక్రమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంతవాహనంలోనే జూబ్లీహిల్స్‌లోని నివాసం నుంచి ప్రజా దర్బార్‌కు చేరుకున్నారు. అనంతరం ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్ మొదలైంది. సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితర మంత్రులు పాల్గొన్నారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలను సీఎం రేవంత్, మంత్రులు స్వీకరించారు. మరోవైపు ప్రజాదర్బార్‌కు మంచి స్పందన లభిస్తోంది. రాష్ట్ర నలుమూల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజాభవన్‌కు భారీగా ప్రజలు చేరుకున్నారు.

తమ సమస్యలు నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం అవుతాయని బాధితులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే : రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శుక్రవారం ప్రజాభవన్‌కు వచ్చిన ఆయన.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాదర్బార్ బాగుందన్నారు. వేలాది మంది ప్రజలు వారి సమస్యలు చెప్పుకోడానికి వస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఏ సీఎం చేయని పని రేవంత్ చేస్తున్నారని అభినందించారు.తాను చూడ్డానికి వచ్చానని.. చాలా



సంతోషంగా ఉందన్నారు. గడిలు బద్దలు కొట్టి ప్రజలు వస్తున్నారని మోత్కుపల్లి నరసింహులు పేర్కొన్నారు.

## తిరుమలలో శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం

తిరుమల,డిసెంబర్8 తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు 5 కంపార్ట్‌మెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 56,344 మంది దర్శించుకోగా 17,616 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.26 కోట్లు వచ్చిందన్నారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో కార్తిక మాసంలో చివరి ఆదివారమైన డిసెంబరు 10న తిరువడి సన్నిధి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ఎదురు ఆంజనేయస్వామివారి మూలవర్లకు తిరుమంజనం, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఉభయనాం చారులతో కలిసి శ్రీ గోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులను ఆంజనేయస్వామివారి సన్నిధికి వేంచేపు చేసి ఏకాంతంగా తిరుమంజనం చేపడతారని వివరించారు. ఉత్సవమూర్తులను ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళతారని వివరించారు.

## అల్మారాల నుంచి రూ. 200 కోట్లు సీజ్



భువనేశ్వర్,డిసెంబర్8 ఒడిశాలోని డిస్టల్లరీ కంపెనీపై రెండు రోజుల నుంచి ఐటీశాఖ తనిఖీలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే బౌద్ డిస్టిల్లరీ కంపెనీ నుంచి సుమారు 250 కోట్ల నగదును సీజ్ చేశారు. జార్ఖండ్‌లో కూడా ఆ కంపెనీ ఆఫీసులపై దాడి జరిగింది. ఇంకా ఆ కంపెనీలపై ఐటీశాఖ తనిఖీలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. తొలి రోజు సుమారు 50 కోట్ల క్యాష్‌ను సీజ్ చేశారు. ఇప్పుడు ఆ అమౌంట్ 200 కోట్లు దాటింది. ఆ మొత్తాన్ని లెక్కపెట్టేందుకు మూడు డజన్ల కౌంటింగ్ మెషీన్లు వాడారు. సామర్థ్యానికి తగ్గ లేనటువంటి మెషీన్లు ఉండడం వల్ల ఇంకా కౌంటింగ్ ప్రక్రియ జరుగుతోంది. జార్ఖండ్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూ ఆఫీసుల్లోనూ సోదాలు జరిగాయి. సుమారు 200 కోట్ల మేర నగదు అల్మారాల్లో కుక్కిపెట్టారు. బాలానగర్ జిల్లాలో ఉన్న డిస్టిల్లరీ గ్రూపు సెంటర్ నుంచి ఆ మొత్తాన్ని సీజ్ చేవారు. సంబల్‌పుర్, సుందర్‌ఘర్, బొకారో, రాంచీల్లోనూ ఐటీశాఖ సోదాలు జరిగాయి.

## అస్సాం నిజానికి మయన్మార్‌లో భాగం

### సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్

న్యూఢిల్లీ,డిసెంబర్8 :అస్సాం నిజానికి మయన్మార్‌లో భాగమని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. 1955 పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6 ఏ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ నెల 5 నుంచి విచారణ ప్రారంభించింది. ప్రతివాదుల తరుఫున వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, అస్సాంతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో అక్రమ వలసలను గుర్తించడం చాలా కష్టమని తెలిపారు. అస్సాం వాస్తవానికి మయన్మార్‌లో ఒక భాగమని అన్నారు. 1824లో ఈ భూభాగాన్ని బ్రిటీష్ స్వాధీనం చేసుకుందని, ఒక ఒప్పందం ద్వారా అస్సాంను బ్రిటీష్ వారికి అప్పగించారని చెప్పారు. ఆ తర్వాత జరిగిన బెంగాల్ విభజనకు ముందు ఈస్ట్ బెంగాల్ (బంగ్లాదేశ్) ప్రాంతంతో ఈ భూభాగానికి సంబంధం ఉండేదని చారిత్రక ఆధారాలతో వెల్లడించారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారుల ప్రవేశాన్ని పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6 ఏ ద్వారా చట్టబద్ధం చేసినట్లు వివరించారు. కాగా, అస్సాం ఒప్పందం అమలులో భాగంగా 1966 జనవరి 1 నుంచి 1971 మార్చి 25 మధ్య అస్సాంలోకి ప్రవేశించిన నిర్దిష్ట విదేశీ వలసదారులు భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి సెక్షన్ 6 ఏ ద్వారా అనుమతించారని కపిల్ సిబల్ తెలిపారు. దీంతో అస్సాం రాష్ట్ర జనాభా, సంస్కృతిని ఇది బాగా ప్రభావితం చేసిందన్నారు. 'ప్రజలు, జనాభా వలసల గురించి చరిత్రలో ఉంది. అయితే ఎక్కడి నుంచి వలస వచ్చారో అన్నది మ్యాప్ చేయలేదు. అస్సాం చరిత్రను పరిశీలిస్తే, ఎవరు ఎప్పుడు ఎక్కడి నుంచి వచ్చారో



అన్నది గుర్తించడం అసాధ్యమన్నది మీరు (ధర్మాసనం) గ్రహించవచ్చు' అని సుప్రీంకోర్టుకు తెలిపారు.

మరోవైపు సీజేఐ చంద్రచూడ్, న్యాయమూర్తులు ఏఎస్ బోపన్న, ఎంఎం సుందరేష్, ఏబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం, ఇరు వర్గాల వాదనలు విన్నది. 1971 మార్చి 25 తర్వాత అస్సాం, ఈశాన్య రాష్ట్రాల్లోకి అక్రమ వలసదారుల ప్రవేశంపై వివరణాత్మక డేటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం ఆదేశించింది. కాగా, అక్రమ వలసదారులుగా పేర్కొంటూ అస్సాంలోని వేలాది మంది ప్రజల పౌరసత్వాన్ని రద్దు చేశారు.దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. తాము భారత పౌరులమేనని నిరూపించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

## బిజెపి కక్షసాధింపు చర్యలు

### – మమతా బెనర్జీ

కోల్‌కతా,డిసెంబర్8 డబ్బు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగారనే ఆరోపణలపై టీఎంసీ ఎంపీ మహువ మొయిత్రను లోక్‌సభ నుంచి బహిష్కరించడం పట్ల పశ్చిమ బెంగాల్ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. తమ పార్టీ సహచరి మహువ మొయిత్రపై వేటు వేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. బహిష్కృత ఎంపీకి పార్టీ బాసటగా నిలుస్తుందని భరోసా ఇచ్చిన దీదీ బీజేపీ కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. తమ పార్టీ ఎంపీని బహిష్కరించాలని ఎథిక్స్ కమిటీ నివేదిక ఇచ్చిన అనంతరం మహువ మొయిత్రకు సభలో మాట్లాడే అవకాశం కల్పించకపోవడం దారుణమని అన్నారు. వివరణ ఇచ్చేందుకు ఎంపీకి అవకాశం ఇవ్వకుండా ప్రజాస్వామ్యాన్ని హత్య చేసిన తీరును తాను ఖండిస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ ఆమెకు పూర్తిగా అండగా ఉంటుందని, ఆమెకు న్యాయం జరగాలని తాము కోరుకున్నా ప్రభుత్వం ఎలాంటి అవకాశం ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఇది బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు అద్దం పడుతోందని దీదీ పేర్కొన్నారు.

ఇది పార్లమెంట్ చరిత్రలో విషాదకర రోజని దీదీ అన్నారు. మొయిత్రను బహిష్కరిస్తూ లోక్‌సభ నిర్ణయం రాజ్యాంగ హక్కులకు తూట్లు పొడవడమేనని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో తమకూ మూడింట రెండు వంతుల మెజారిటీ ఉందని, ఎవరినైనా తక్షణమే బహిష్కరించే అవకాశం ఉందని, కానీ తాము ఇలాగే చేయాలా అని ఆమె ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలకు కేవలం రెండు, మూడు నెలల సమయం మాత్రమే ఉండగా ఇలాంటి ఘటన దురదృష్టకర మని, తాము అంగీకరించబోమని దీదీ స్పష్టం చేశారు.

## రెండ్రోజులపాటు అసెంబ్లీ

### ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్



హైదరాబాద్,డిసెంబర్8 శనివారం నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రెండ్రోజుల పాటు ఈ సమావేశాలు జరిపించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీని నియమించింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల చేత ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. కొత్త స్పీకర్ ఎన్నికయ్యేంత వరకూ అక్బరుద్దీన్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటిదాకా ప్రొటెం స్పీకర్ ఎవరన్నదానిపై చర్చ జరిగింది. సీనియారిటీ ప్రకారం మాజీ సీఎం కేసీఆర్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించాల్సి ఉంది. 8 సార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. కానీ ఇంతలోనే బాత్రూంలో కాలు జారి గాయాల పాలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 8 వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఇక తర్వాత వరుసలో బీఆర్ఎస్ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఉన్నారు. ఇక కాంగ్రెస్‌లో ఆరుసార్లు ఎన్నికైన ఎమ్మెల్యేల్లో ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. కానీ వీరిద్దరూ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మొత్తానికి రేవంత్ సర్కార్ అక్బరుద్దీన్ ఒవైసీ వైపు మొగ్గు చూపింది.ప్రస్తుతం అసెంబ్లీలో కాంగ్రెస్ -64 సీట్లు, బీఆర్ఎస్-39 మంది, బీజేపీ -8మంది,ఎంఐఎం-7కు, సిపిఐకి ఒక సభ్యులు ఉన్నారు.

## ఏపి గ్రూప్.1 నోటిఫికేషన్ విడుదల

### జనవరి 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ

అమరావతి,డిసెంబర్8: నిరుద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 81 పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ గ్రూప్-1 నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది. మార్చి 17న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది. ఈ పరీక్ష కోసం వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ దరఖాస్తు స్వీకరించనున్నారు. గ్రూప్-1లో 6 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు, 26 డీఎస్పీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఏపీపీఎస్సీ పేర్కొంది.

## ఓట్ల అవకతవకలపై ఎన్నికల అధికారికి చంద్రబాబుకు ఫిర్యాదు

అమరావతి,డిసెంబర్8 రాష్ట్రంలో ఓట్ల అవకతవకలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనాకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. రాష్ట్రంలో అధికారపార్టీ ఓట్ల అవకతవకలకు పాల్పడుతోందన్నారు. ఎలక్టోరల్ మాన్యువల్ 2023 ప్రకారం ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు జరగడం లేదన్నారు. మాన్యువల్ ప్రకారం జనాభాపరమైన సారూప్య ఎంపికలు, ఫోటోగ్రాఫిక్ సారూప్య ఎంపికలు పరిశీలించి డబుల్ ఎంట్రీలను తొలగించాలని.. కానీ, ఓటర్ల జాబితాలో అనేక నియోజకవర్గాలలో ఇప్పటికీ డబుల్ ఎంట్రీలు గుర్తించబడుతూనే ఉన్నాయన్నారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్ 1960 ప్రకారం ఓట్లను ఇంటి నంబర్ల ప్రకారం క్రమంగా ఉండేలా చూడాలని.. కానీ నేటికి దీనికి సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అధికార పార్టీకి అనుకూలంగా ఇష్టానుసారం ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఓటుపై అభ్యంతరం లేవనెత్తి ఓట్లను తొలగించాలని కోరుతున్న వారు ఖచ్చితంగా ఆధారాలు చూపించాలన్నారు. కొన్ని నియోజకవర్గాలలో ఎటువంటి విచారణ చేయకుండా తెల్ల పేపర్‌పై పేర్లు రాసిస్తే ఓట్లను తొలగిస్తున్నారన్నారు. ఓట్లు మార్పులు చేర్పులకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక రివిజన్ సమ్మరీ సందర్భంగా చాలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్టు ప్రకటించి నెల గడుస్తున్నా పైన పేర్కొన అనేక అభ్యంతరాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఫైనల్ లిస్టులో ఓట్ల అవకతవకలు మరలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని లేఖలో చంద్రబాబు కోరారు.

## చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్ జనవరి 19కి వాయిదా



అమరావతి,డిసెంబర్8 :స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్ విచారణ జనవరి 19కి వాయిదా పడింది. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై తీర్పు రాకపోవడంతో బెయిల్ రద్దు పిటిషన్‌ను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. శుక్రవారం జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం ఎదుట కేసు విచారణకు రాగా చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది హరీష్‌సాల్వే వాదించగా ప్రభుత్వం తరఫున మరో న్యాయవాది వాదించారు. 17 ఏ వ్యవహారంపై తీర్పు ఇస్తే మాత్రం వాయిదా వేయాలని, వాయిదా వేయకుంటే విచారణ తేదీ చెప్పాలని హరీష్‌సాల్వే అభ్యర్థించారు. ఇందుకు గాను కౌంటర్ దాఖలుకు సిద్ధంగానే ఉన్నామని ఆయన వెల్లడించారు. స్కిల్ కేసు 17 ఏ తీర్పుతో ముడిపడి ఉందని హరీష్‌సాల్వే చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ విచారణను జనవరి మూడో వారంలో చేపడతామన్న ధర్మాసనం వెల్లడించగా తేదీ ఖరారు చేయాలని సాల్వే కోరారు. సాల్వే విజ్ఞప్తితో విచారణను జనవరి 19కి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. జనవరి 19లోగా కౌంటర్ వేయాలని చంద్రబాబు తరుపు న్యాయవాదికి, ఆ కౌంటర్‌కు రిజాయిండర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# ప్రజా దర్బార్‌లో ప్రజా సమస్యలు తెలుసుకున్న సీఎం రేవంత్

హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు శ్రీకారం చుట్టారు.ముఖ్యమంత్రి అధికార నివాసమైన మహాత్మా జ్యోతిభా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. మొదటగా దివ్యాంగులకు ప్రాధాన్యం ఇచ్చి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు.ప్రజాదర్బార్ వేదికకు వివిధ సమస్యలపై విన్నవించుటకు పెద్ద ఎత్తున వచ్చిన ప్రజల విజ్ఞాపనలు ముఖ్యమంత్రి స్వీకరించి, వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ (సీతక్క) ఉన్నారు.ముఖ్యమంత్రి అత్యవసర సమావేశం నిమిత్తం సెక్రటేరియట్ బయలుదేరారు. అనంతరం ప్రజా దర్బార్‌కు వివిధ సమస్యల పరిష్కారానికై వచ్చిన ప్రతిఒక్కరి నుండి మంత్రి సీతక్క విజ్ఞాపనలు స్వీకరించారు. ప్రజాదర్బార్ నిర్వహణకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, డీజీపీ రవిగుప్తా, జలండలి ఎండీ దాన కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, ముషార్రాఫ్ తదితర అధికారులు ప్రజాదర్బార్ నిర్వహణను సమన్వయం చేశారు.



గ్రీవెన్స్ రిజిస్ట్రేషన్‌లకు 15 డెస్క్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రతి విజ్ఞాపన పత్రాన్ని ఆన్‌లైన్ ఎంట్రీ చేసి, ప్రతి విజ్ఞాపనకు ప్రత్యేక గ్రీవెన్స్ నెంబర్ ఇచ్చి, ప్రింటెడ్ ఎకనాలెడ్జిమెంట్ ఇవ్వడం, పిటిషన్‌దారులకు ఎస్ఎంఎస్ ద్వారా కూడా ఎకనాలెడ్జిమెంట్ పంపేవిధంగా ఏర్పాటు చేశారు. ప్రజాదర్బార్ లోపల ప్రజలు కూర్చోవడానికి 320 సీట్లను ఏర్పాటు చేశారు. బయట కూడా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎండ నుంచి రక్షణకై క్యూలైన్ల పైన నీడను కల్పించారు. ద్వారాల వద్ద నిలుచున్న వారికి , ప్రజాదర్బార్ లోకి వచ్చిన ప్రజలకు తాగునీటి వసతి, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించారు. హైదరాబాద్ నగరం నుండే కాకుండా వివిధ జిల్లాల నుంచి విజ్ఞాపనలతో వచ్చిన ప్రజలతో ప్రజాదర్బార్ కిక్కిరిసింది.

# పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీ..

తెలంగాణలో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు డిసెంబర్ 9వ తేదీ శనివారం మధ్యాహ్నం నుంచి బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

తెలంగాణ రాష్ట్రంలో బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇదొకటి. అయితే, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం (డిసెంబర్ 8న) ఉత్తర్వులు జారీ చేసింది.

దీనిపై శుక్రవారం (డిసెంబర్ 8న) ఆర్టీసీ విధి విధానాలు రూపొందించారు. ఏయే బస్సుల్లో మహిళలు, చిన్నపిల్లలు, బాలికలు టికెట్లు తీసుకోకుండానే జర్నీ చేయవచ్చో చెప్పారు.




విధివిధానాలు ఇవే..

జిల్లాల్లో పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీ

- సిటీలో మాత్రం ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ఫ్రీ జర్నీ
- మహిళల వయసుతో సంబంధం లేదు
- చిన్నారులు, బాలికలకు కూడా ఫ్రీ జర్నీ
- ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచితం
- తెలంగాణలో ఎక్కడైనా తిరగొచ్చు
- అంతరాష్ట్ర బస్సులకు తెలంగాణ పరిధి వరకు ఉచితం
- ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు చూపించాలి
- మొదటి వారం రోజులు ఐడెంటి కార్డులు లేకుండానే ప్రయాణం చేయవచ్చు

## నేటినుంచి తెలంగాణ మహిళలకు ఫ్రీ బస్

### లాంఛనంగా ప్రారంభించనున్న సిఎం రేవంత్



హైదరాబాద్,డిసెంబర్8:ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం శనివారం నుంచి అమల్లోకి రానుంది. సిఎం రేవంత్ రెడ్డి దీనిని లాంఛనంగా ప్రారంభించనున్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇది కూడా ఒకటి. ఈనెల 9 నుంచి ఈ గ్యారెంటీ అమలులోకి వస్తుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈమేరకు మంత్రి వర్గంలో నిర్ణయం కూడా తీసుకున్నారు. మొత్తం ఆరు గ్యారెంటీలను వందరోజుల్లోపు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ముందుగా రెండు గ్యారెంటీలను అమలులోకి తెస్తోంది. ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు ఇందులో ఒకటి కాగా, మహిళల ఉచిత ప్రయాణం మరో ప్రధాన గ్యారెంటీ. తెలంగాణ కంటే ముందు కర్నాటకలో కూడా ఇలాంటి గ్యారెంటీలను ప్రకటించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అక్కడ కూడా మహిళల ఉచిత ప్రయాణం అనే పథకాన్ని అమలులోకి తెచ్చింది కాంగ్రెస్. మొదట్లో కాస్త ఇబ్బంది పడ్డా.. తర్వాత అంతా సర్దుకుపోయింది. కర్నాటక ప్రభుత్వం ఈ ఏడాది జూన్ నుంచి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఇచ్చింది. కర్నాటకలో మొత్తం 22 వేల పైచిలుకు బస్సులున్నాయి. ఇందులో ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మాత్రమే మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం ఉంది. ఈ పథకం అమలులోకి రాకముందు కర్నాటక బస్సుల్లో సగటున పురుషులు 60శాతం మంది ప్రయాణిస్తుండగా, మహిళలు 40శాతం మంది ప్రయాణిస్తున్నారు. ఉచిత ప్రయాణ పథకం అమలులోకి వచ్చాక ఈ నిష్పత్తిలో మార్పు వచ్చింది. మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం అక్కడి బస్సుల్లో మహిళలు 55శాతం మంది ప్రయాణిస్తుండగా, పురుషుల సంఖ్య సహజంగానే 45కి పడిపోయింది. మహిళలే ఎక్కువగా బస్సులు ఎక్కుతున్నారు. కర్నాటకకు చెందిన స్థానిక మహిళలకే ఆ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశముంది. కర్నాటక రాష్ట్రంలో తిరిగే బస్సుల్లో మాత్రమే ఈ వెసులుబాటు ఉంది. అంతర్ రాష్ట్ర సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం లేదు. తెలంగాణలో ఈ పథకం నేటి నుంచి అమలులోకి వస్తుంది. కేబినెట్ మీటింగ్ తర్వాత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ పథకంపై వివరాలు తెలియజేశారు. ఈనెల 9 నుంచి మహిళలు తమ గుర్తింపు కార్డు చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు అని చెప్పారు. ఆధార్ కార్డు లేదా ఇతర కార్డులు చూపించి మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే అవకాశముంది. దీనిపై కాసేపట్లో విధివిధానాలు ఖరారు కానున్నాయి. ముఖ్యంగా ఈ పథకం ఆ రాష్ట్రంలోని మహిళలను ఉద్దేశించి ప్రవేశపెట్టింది. అందుకే స్థానికత చూసేందుకు గుర్తింపు కార్డులు అడుగుతున్నారని తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల గుర్తింపు కార్డులు ఉన్నవారికి తెలంగాణ రాష్ట్ర సర్వీసుల్లో ప్రయాణించే అవకాశం ఉండదని అంటున్నారు. ప్రస్తుతానికి నిబంధనల గురించి ఆర్టీసీ ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. ఆర్టీసీ పూర్తి వివరాలు, నియమనిబంధనలు బయటపెడితే ఈ పథకంపై అందరికీ అవగాహన వచ్చే అవకాశముంది.
మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటే.. వెంటనే దాని ప్రభావం ఆర్టీసీతోపాటు ఆటోవాలాలపై కూడా పడుతుంది. ఇప్పటి వరకు ఆటోలు ఎక్కి ప్రయాణించినవారంతా.. ఆర్టీసీ బస్సుకోసం వేచి చూస్తారు. కాస్త ఆలస్యమైనా ఆర్టీసీ ప్రయాణాన్నే కోరుకుంటారు. అంటే పరోక్షంగా ఆటోవాలాలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. కర్నాటకలో కూడా ఈ సమస్య ప్రారంభమైంది. అయితే మహిళల స్థానంలో పురుషులు ఎక్కువగా ఆటోలు ఎక్కడం వల్ల ఆ నష్టం కాస్త భర్తీ అయింది. తెలంగాణలో కూడా ఇలాంటి సమస్య ఇప్పుడు తెరపైకి వస్తుంది. దీనికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. ఇప్పటి వరకు మహిళలు టికెట్ కొని ప్రయాణించేవారు, ఇకపై వారు టికెట్లు కొనరు. మహిళలు ఎక్కువమంది బస్సులో నిండిపోతే.. పురుషులకు స్థానం ఉండదు. అంటే మహిళల ప్రయాణాలు పెరుగుతాయి, ఆటోమేటిక్ గా పురుషుల టికెట్లు తగ్గిపోతాయి. ఈమేర ఆర్టీసీకి నష్టం వస్తుంది. దీన్ని ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నెలనెలా ఈ ఖర్చులను భరిస్తూ ఆర్టీసీకి సాయం చేస్తే పథకం సాఫీగా అమలవుతుంది. ఎక్కడ తేడా వచ్చినా ఈ పథకం అభాసుపాలవుతుంది.

## బిజెపి రాష్ట్రాల్లో సిఎంలపై సందిగ్ధత

### మూడు రాష్ట్రాలకు కమిటీలనునియమించిన బిజెపి

న్యూఢిల్లీ,డిసెంబర్8: రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన క్రమంలో సిఎం ఎవరన్నదానిపై స్పష్టం రాలేదు. ఆయా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులెవరనేదానిపై ఇంకా సందిగ్ధత వీడలేదు. ముఖ్యమంత్రి అభ్యర్థులు ఎక్కువగా పోటీలో ఉండటమే ఈ తర్జన భర్జనలకు కారణమని తెలుస్తోంది. ఈ సస్పెన్స్ కు తెరదించుతూ.. బీజేపీ శుక్రవారం కేంద్ర పరిశీలకులను నియమించింది. వీరు మూడు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రిగా ఎవర్ని ఉంచాలనే అంశంపై చర్చిస్తారు. రాజస్థాన్ పరిశీలకులుగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, వినోద్ తవాడే, సరోజ్ పాండేలను పార్టీ నియమించింది. మధ్యప్రదేశ్‌కు హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కె లక్ష్మణ్, ఆశ లక్రాలను నియమించింది. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, దుష్యంత్ గౌతమ్‌లను పరిశీలకులుగా నియమించారు. పరిశీలకుల కమిటీ ముఖ్యమంత్రుల పేర్లను వారాంతంలో ప్రకటించే ఛాన్స్ ఉంది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల సమావేశాలను పర్యవేక్షించేందుకు పరిశీలకులు ఆయా రాష్ట్రాలకు వెళ్తారని.. అక్కడ కాబోయే ముఖ్యమంత్రి పేరు వెల్లడించే అవకాశం ఉందని ఓ బీజేపీ నేత తెలిపారు. సీఎం ఎంపికపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ముఖ్యమంత్రులను ఎన్నుకోవడంలో సామాజిక, ప్రాంతీయ, పాలన, సంస్థాగత ప్రయోజనాలను దృష్టి ఉంచుకుంటారని తెలిపారు.

## తెలంగాణ కమల దళపతిగా కిషన్ రెడ్డి తప్పుకోనున్నారా ?

- రాష్ట్ర పార్టీని ప్రక్షాళన చేయబోతున్నారా ?
-కొత్తగా పార్టీ హైకమాండ్ ఎవరికి ఛాన్స్ ఇస్తుంది ?
-పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రయోగాలకు ధైర్యం చేస్తారా?
-కిషన్ రెడ్డినే కొనసాగిస్తారా?



బీజేపీ హైకమాండ్ తెలంగాణ కాషాయ పార్టీని ప్రక్షాళన చేయాలని భావిస్తోంది. కమలం పార్టీ రాష్ట్ర సారథిగా ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని నియమించారు. బీజేపీ హైకమాండ్ ఒత్తిడితో పార్టీ పగ్గాలు చేపట్టిన కిషన్ రెడ్డి శక్తి మేర కష్టపడ్డారు. ఎన్నికల్లో 8 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర పార్టీ పగ్గాలు ఇతరులకు ఇవ్వాలని కిషన్ రెడ్డి పార్టీ అధిష్టానానికి విన్నవించుకున్నారు. రాష్ట్ర పార్టీ బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే దానిపై బీజేపీ హైకమాండ్ కసరత్తు మొదలుపెట్టింది.తెలంగాణ కాషాయ దళపతిగా ఎవరికి ఛాన్స్ ఇస్తారనే దానిపై పార్టీలో విస్తృత చర్చ కొనసాగుతోంది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో కొత్తగా ఎటువంటి ప్రయోగాలు చేయకుండా కంటిన్యూ కావాలని ఓ వైపు యోచిస్తోంది. అయితే రాష్ట్ర నేతల మధ్య సమన్వయం లేకపోవడం పార్టీకి ఇబ్బందిగా మారింది. రాష్ట్ర స్థాయి నేతలు ఎవరికి వారు సోషల్ మీడియాలో సొంత పార్టీలో ప్రత్యర్థులను డీగ్రేడ్ చేస్తూ కామెంట్స్ పెట్టడం పార్టీకి తలనొప్పి వ్యవహారంగా మారింది. ఇక పార్టీ ఫుల్ టైమర్ గా పనిచేసిన రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాస్ వెళ్లిపోయిన తర్వాత... కొత్తగా ఎవరిని నియమించలేదు. దీంతో రాష్ట్ర పార్టీ నేతల సమన్వయం పెద్ద తలనొప్పిగా మారింది.

## ముఖ్యమంత్రుల ఎంపికపై ఇంకా వీడని ఉత్కంఠ

న్యూఢిల్లీ,డిసెంబర్8 ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించింది. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడి ఐదు రోజులైనా ఆ మూడు రాష్ట్రాల్లో ఇంకా ముఖ్యమంత్రులను ఎంపిక చేయలేదు. ఆయా రాష్ట్రాల కొత్త ముఖ్యమంత్రుల పేర్లు ఇప్పటికీ ఖరారు కాలేదు. ఈ క్రమంలో ఆ మూడు రాష్ట్రాల్లో సీఎంల ఎంపిక కోసం బీజేపీ తొమ్మిది మంది పరిశీలకులను నియమిం(చింది. ఒక్కో కమిటీలో ముగ్గురు పరిశీలకుల చొప్పున మూడు రాష్ట్రాలకు మూడు కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీల్లో ముగ్గురు కేంద్రమంత్రులు కూడా ఉన్నారు. రాజస్థాన్ సీఎం ఎంపిక కోసం ఏర్పాటైన కమిటీలో కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, నేషనల్ జనరల్ సెక్రెటరీ వినోద్ తావ్డే, రాజ్యసభ ఎంపీ సరోజ్ పాండే సభ్యులుగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎం ఎంపిక కోసం ఏర్పాటు చేసిన కమిటీలో హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్, పార్టీ సీనియర్ నేతలు డాక్టర్ కే లక్ష్మణ్, ఆశా లక్డా పరిశీలకులుగా ఉన్నారు. కేంద్ర వ్యవసాయ, గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా, షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్, నేషనల్ జనరల్ సెక్రటరీ దుష్యంత్ కుమార్ గౌతమ్ ఛత్తీస్‌గఢ్ సీఎం ఎంపిక కోసం ఏర్పాటు చేసిన పరిశీలకుల కమిటీలో సభ్యులుగా ఉన్నారు.
ఈ మూడు కమిటీల్లో ఏ రాష్ట్రానికి సంబంధించిన కమిటీ పరిశీలకులు ఆ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎమ్మెల్యేల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాల ఆధారంగా సీఎం అభ్యర్థులను ఖరారు చేస్తారు. ఈ కమిటీలు ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను బీజేపీ జాతీయ నాయకత్వం కూడా పరిశీలించి ఫైనల్ చేస్తుంది.

లోక్‌సభ నుంచి బహిష్కరించాలంటూ పార్లమెంటు ఎథిక్స్ కమిటీ సిఫారసు చేయడం, నివేదికను లోక్‌సభలో శుక్రవారంనాడు ప్రవేశపెట్టడంపై ఆమె ఘాటుగా స్పందించారు. ''ఇక మహాభారత యుద్ధాన్ని చూస్తారు'' అంటూ వ్యాఖ్యానించారు. నివేదికపై మహువా మెయిత్రా పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ..''దుర్గా మాత వచ్చింది. ఇక చూసుకుందాం. వినాశనం సంభవించినప్పుడు మొదట కనుమరుగయ్యేది వివేకమే, వస్త్రాపహరణను వాళ్లు మొదలుపెట్టారు. ఇక మహాభారత యుద్ధాన్ని చూస్తారు'' అంటూ బీజేపీ సర్కార్‌పై ఘాటు విమర్శలు చేశారు.

లోకసభలో 500 పేజీలతో కూడిన నివేదికను బీజేపీ ఎంపీ, ఎథిక్స్ కమిటీ చైర్మన్ విజయ్ సోన్కర్ టీఎంసీ ఎంపీల ఆందోళనల మధ్య శుక్రవారం ఉదయం ప్రవేశపెట్టారు. ఎథిక్స్ కమిటీ నివేదక కాపీ తమకు ఇవ్వాలని, ఓటింగ్‌కు ముందు చర్చ జరిపాలని, టీఎంసీ మొయిత్రీ తన వాదన వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను టీఎంసీ ఎంపీలు కోరారు.

కాగా, సభలో మహువా మొయిత్రా మాట్లాడేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతి నిరాకరించారు. 2005లో స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే ఆరోపణలను ఎదుర్కొన్న 10 మంది ఎంపీలను సభలో మాట్లాడేందుకు అప్పటి స్పీకర్ సోమ్‌నాథ్ ఛటర్జీ అనుమతి నిరాకరించారని అన్నారు. నాటి స్పీకర్లు పాటించిన సంప్రదాయాన్నే తాను అనుసరిస్తున్నట్టు ఓం బిర్లా చెప్పారు.

## కెటిఆర్, కవితలకు కౌంట్‌డౌన్

### - మరో లేఖ విడుదల చేసిన సుఖేష్





న్యూఢిల్లీ,డిసెంబర్8 మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితకు కౌంట్ డౌన్ ప్రారంభమైందని, రూ.200 కోట్ల మనీలాండరింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సుఖేష్ చంద్రశేఖర్ మండోలి జైలు నుంచి మరో సంచలన లేఖను విడుదల చేశారు. కవిత, కేటీఆర్ అవినీతి బయటపడుతుందని తెలిపారు. వీరిద్దరూ త్వరలో జైలు క్లబ్‌లో చేరుతారన్నారు. డియర్ కేటీఆర్ బ్రదర్, కె.కవితక్క.. అసెంబ్లీ ఎన్నికల్లో మీరు సాధించిన ఫలితాలకు అభినందనలు. మీ అబద్ధాలు, అత్యాశలు, అవినీతి తెలుగు ప్రజలకు అర్థమైనట్లే మీ అహంకారం కూడా అంతమవుతుందని కొన్ని నెలల క్రితం నేను చెప్పిన విషయం గుర్తుండే ఉంటుంది. మీ గురించి తెలుసుకున్న ప్రజలు మీకు ఈ విధమైన తీర్పు ఇచ్చారు. మీరు నన్ను మోసగాడు అన్నారు. కానీ ఇవాళే మీరే మోసగాళ్లలా మిగిలిపోయారు. ఇప్పుడు మీకు, నాకు అట్టే తేడా ఏమీ లేదు. మీరు అవినీతిపరులు కాదని నిరూపించుకునేందుకు సిద్ధమవ్వండి. త్వరలోనే మీరు కూడా జైలు క్లబ్‌లో చేరుతారు. త్వరలోనే మీరంతా అమెరికాకు పయనమవుతారని భావిస్తున్నా. మీకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ దేశంలో చట్టం, సామాన్యుడి కంటే ఎవరూ శక్తివంతులు కాదు. ఫలితాల రోజు ఎక్స్‌లో తుపాకీ పట్టుకుని 3.0 అని మీరు పెట్టిన పోస్ట్ చూశాను. మీరు చెప్పిన 3.0 జైలు జీవితం త్వరలోనే ప్రారంభమవుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ అన్నకు అభినందనలు అని సుఖేష్ లేఖలో పేర్కొన్నారు.

## కెసిఆర్ కోసం ఆస్పత్రికి ఎవరూ రావద్దు

### - కార్యకర్తలకు హరీష్ రావు సూచన



హైదరాబాద్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పరామర్శించేందుకు ఎవరూ హాస్పిటల్ రావొద్దని అభిమానులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని అభిమానులు ఆందోళన చెందవద్దన్నారు. కేసీఆర్‌ను పరిశీలించిన వైద్యులు తుంటి ఎముక విరిగినట్లు గుర్తించారు. దీంతో ఐసీయూకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కేసీఆర్‌కు హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయనున్నారు. కేసీఆర్ కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాలు పడుతుందని హరీశ్ రావు తెలిపారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాలుజారి పడటంతో ఆయనకు గాయమైన విషయం తెలిసిందే. దీంతో గురువారం అర్ధరాత్రి సోమాజిగూడలోని యశోద దవాఖానకు తరలించారు. పరిశీలించిన వైద్యులు ఎడమ కాలి తుంటి ఎముక విరిగిందని నిర్ధారించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. తుంటి ఎముక మార్పిడి చేయాలని, కోలుకోవడానికి 6 నుంచి 8 వారాలు పడుతుందని చెప్పారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని వెల్లడించారు. కాగా, దవాఖానలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదం వల్ల పెద్ద శస్త్ర చికిత్స జరుగనుంది. ఆయన త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ కుటుంబ సభ్యులతోపాటు తాము కూడా ప్రార్థిస్తున్నామని చెప్పారు. ఈమేరకు ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు.

## ములుగు జిల్లాలో కాంగ్రెస్ సంబరాలు

ములుగు,డిసెంబర్8 తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు. ములుగు జిల్లా, వెంకటాపురంలో కాంగ్రెస్ నేతలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సందడి చేశారు. దశాబ్దం తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బాణాసంచా కాల్చారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు జేజేలు పలికి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మరోవైపు సీతక్క మంత్రి కావడంతో ములుగు జిల్లా వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. తొలిసారి తమ సీతక్క మంత్రి కావడంతో ఆనందం పంచుకున్నారు.

## బీజేపీ ప్రజాస్వామ్యాన్ని చంపేసింది.. ఆమె గెలిచి వస్తుంది'



ఢిల్లీ: పార్లమెంట్‌లో డబ్బుకు ప్రశ్నల వ్యవహారంలో టీఎంసీ ఎంపీ మహువా మెయిత్రాపై వేటు పడిన విషయం తెలిసిందే. ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరిస్తున్నట్లు పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ క్రమంలో సభలో ఉన్న ప్రతిపక్ష ఎంపీలందరూ ఆమెకు మద్దతుగా సభ నుంచి వాకౌట్ చేశారు. ఇక ఈ వ్యహారంపై టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. బీజేపీవి ప్రతీకార రాజకీయాలని మండిపడ్డారు. బీజేపీ దేశంలో ప్రజాస్వామ్యాన్ని చంపేసిందని దుయ్యబట్టారు. బీజేపీ తమ పార్టీ ఎంపీపై వ్యవహరించిన తీరు చాలా అన్యాయమని అన్నారు. మహువా మెయిత్రా మళ్లీ గెలిచి వస్తుందని తెలిపారు. ఎన్నికల్లో తనకు ప్రజలు న్యాయం చేస్తారని చెప్పారు. బీజేపీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చవి చూస్తుందని మండిపడ్డారు.

# నంద్యాలలో ముస్లిం మైనారిటీలకు సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి

**12 కోట్ల రూపాయల వ్యయంతో 6నూతన ఉర్దూ జూనియర్ కళాశాల, వసతిగృహం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సద్భవన్ బిల్డింగ్, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ బాయ్స్ అండ్ గర్ల్స్ నూతన భవనాల నిర్మాణానికి భూమి పూజ...ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, కలెక్టర్, జేసీ.**



నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 8. జనవాహిని న్యూస్. నంద్యాల పట్టణంలో అత్యధిక శాతం ఉన్న ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి వైఎస్ఆర్సిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని నంద్యాల శాసనసభ్యులు కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధిలో భాగంగా నంద్యాలలో మైనార్టీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉర్దూ జూనియర్ కళాశాల, వసతి గృహం, వందమంది ఉపయోగపడే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సద్భవన్, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ బాయ్స్ అండ్ గర్ల్స్ హాస్టల్ లను 12 కోట్ల రూపాయల వ్యయంతో నూతన 6భవనాల నిర్మాణానికి నేడు భూమి పూజ కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా, జిల్లా కలెక్టర్ డా. మనజీర్ సమూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాబన్నీసా, ఉర్దూ స్టేట్ డైరెక్టర్, మాజీ ఏపీ పీఎస్సీ ఛైర్మన్ డా. నౌమాన్ పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాలలో అత్యధిక శాతం ముస్లిం మైనార్టీలు ఉన్న ప్రాంతమని, ప్రత్యేకంగా ముస్లింల అభ్యున్నతికి వైఎస్ఆర్సిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని తెలిపారు. నంద్యాలలో చేపట్టిన అనేక అభివృద్ధిలో భాగంగా ప్రధానంగా ముస్లిం మైనార్టీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నంద్యాల పట్టణంలోని వైయస్సార్ నగర్ ప్రాంతంలో 4.5 ఎకరాల స్థలంలో 12 కోట్ల రూపాయల వ్యయంతో భవనాలను నిర్మించేందుకు నేడు భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. గతంలో నంద్యాలలో మైనారిటీ బాలికలు ఉర్దూ మీడియం జూనియర్ కళాశాలలో చదివేందుకు అనేక ఇబ్బం దులు ఎదుర్కొన్నారని, ఈ విషయం తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు సొంత నిధులతో ఉర్దూ జూనియర్ కళాశాలలో పనిచేసే అధ్యాప కులకు జీతాలు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. అయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కల్పించే దిశలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని నంద్యాలలో మైనార్టీలు అత్యధిక శాతం నివసిస్తున్న ప్రాంతమని వారి అభ్యున్నతికి ఉర్దూ జూనియర్ కళాశాల వసతి గృహం, తదితర సంక్షేమ భవనాలను ఏర్పాటు చేయడానికి నిధులను కేటాయించాలని కోరడం జరిగింది అన్నారు. ముఖ్యమంత్రి స్పందించి భవనాల నిర్మాణానికి 12 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారని తెలిపారు. నంద్యాల పట్టణానికి సమీపంలో వైఎస్ఆర్ నగర్ వద్ద 4.5 ఎకరాల భూమిలో ఈ భవనాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అలాగే నంద్యాల పట్టణంలో మూలాన్ పేటలో ఉర్దూ మీడియం పాఠశాలకు మూడు ఫ్లోర్లలో 8 గదులను నిర్మించామని అన్నారు. నాడు నేడు కింద అనేక పాఠశాల భవనాలకు మహర్దశ వచ్చిందని పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థులు మాతృభాషలో చదివేందుకు అన్ని విధాల వసతులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నంద్యాలలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి ఈ విద్యా సంవత్సరం దిగ్విజయంగా కొనసాగిస్తున్నామని, అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల శిథిలావస్థలో ఉంటే ఆ కళాశాలను నూతన భవనాలను నిర్మించేందుకు తమ వంతు కృషి చేశామన్నారు. భవిష్యత్తులో నంద్యాలలో మరింత అభివృద్ధి చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ నౌమాన్, నంద్యాల డిస్ట్రిక్ట్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సిబిహ పర్వీన్, మున్సిపల్ చైర్ పర్సన్ మాభూమిసా, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ కాజీ అబ్దుల్ కలాం మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, కౌన్సిలర్ సావిత్రమ్మ, మున్సిపల్ కౌన్సిలర్స్ కోఆప్షన్ సభ్యులు వార్డు ఇన్చార్జిలు వైఎస్ఆర్సిపి మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వసతులు కల్పించాలి

**– పి.వై.ఎల్ నాయకులు ఆనంద్**



నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 8.. జనవాహిని న్యూస్. నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం (పి.వై.ఎల్)నాయకులు ఆనంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు స్థానిక నంద్యాల నగరంలో నంద్యాల జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ (ఎం.ఓ) డి.ప్రసాద్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.వై.ఎల్ నాయకులు ఆనంద్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ప్రభుత్వ వైద్యశాల నందు అల్ట్రాసౌండ్ మరియు న్యూరో విభాగానికి చెందిన వైద్యులు లేకపోవడంతో రోగులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నంద్యాల జిల్లా వైద్యశాలకు చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి పెద్ద మొత్తంలో ప్రతిరోజు వైద్య అవసరాల కొరకు వస్తున్నారని రోగులు సంబంధిత డిపార్ట్మెంట్ కి వెళ్ళినప్పుడు డాక్టర్లు సరైన వైద్యం అందించడం లేదని అన్నారు. అంతే కాకుండా కొందరు ప్రభుత్వ వైద్యులు మా హాస్పిటల్ నందు సౌకర్యాలు లేవని బయటకు వెళ్లి ప్రైవేటు వైద్య హాస్పిటల్ లో చూపించుకోండి అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదెక్కడి న్యాయం అని ఎవరైనా డాక్టర్లతో వాదించగా మీరు పోయి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసుకొండని నిర్లక్ష్యంగా చెబుతున్నారని తెలిపారు. కావున ఇప్పటికైనా తక్షణమే జిల్లా ప్రభుత్వ వైద్యశాల అధికారులు మరియు నంద్యాల జిల్లా కలెక్టర్ గారు తక్షణమే స్పందించి ఆసుపత్రి నందు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పి.వై.ఎల్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## బోగస్ ఓట్ల తొలగింపుపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు



నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 8. జనవాహిని న్యూస్. నంద్యాల జిల్లా పరిదిలో ఉన్న బోగస్ ఓట్లను మరోమారు పరిశీలించి తొలగించాలని కోరుతూ గురువారము వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్వర్యంలో ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష కలసి జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సామూన్ కు వినతి పత్రాన్ని అందజేశారు.

ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతలు తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, బోగస్ ఓట్లను తాము చేర్పిస్తున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి సూచన మేరకు జిల్లాలో ఓటర్ జాబితా నుంచి బోగస్ ఓట్లను అధికారులు పరిశీలించి తొలగించాలని కోరామన్నారు. పారదర్శకంగా, స్వచ్ఛీకరణ ఓటరు జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరామన్నారు.

# రేపటి నుండే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

(సిద్దిపేట జనవాహిణి స్టాఫ్ రిపోర్టర్ చిట్యాల భానుబాబు ) హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో రేపు తెలంగాణ ప్రదాత సోనియమ్మ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరాక, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన 6 గ్యారంటీల్లో తొలి గ్యారంటీగా రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రెండవ గ్యారంటీగా రూ. 10 లక్షల విలువైన ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేయాలని మంత్రి మండలి నిర్ణయించిన సందర్భంగా రేపు సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ రెండు పథకాలను అమలు చేయనున్నట్లు, ఈ రెండు పథకాల ను అమలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్ర వారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశం అయ్యారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు యూత్ కాంగ్రెస్ తో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు రేపు తెలంగాణ ప్రదాత సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా నియోజకవర్గం లోని మండల కేంద్రాల్లో సంబరాలు జరుపుకో వాలని అన్నారు.

రేపు ఉదయం 7 గం.లకు నియోజక వర్గం లోని అన్ని మండల కేంద్రాలలో, బస్సు సౌకర్యం ఉన్న గ్రామాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పై అవగాహన కల్పించాలని, ఆధార్ కార్డు చూపిస్తే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు కేడం లింగ మూర్తి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిత్తారి రవి, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంక చందు, సింగిల్ విండో డైరెక్టర్ గుర్రాల లింగా రెడ్డి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బినవేన రాకేష్ , కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, భుక్యా సరోజన, నాయకులు వెన్న రాజు, బూరుగు కీష్ట స్వామి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ , టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగర్, అక్కన్న పేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దామోదర్, చిగురు మామిడి యూత్ అధ్యక్షులు రెడ్డి యాదగిరి, భీమ దేవరపల్లి యూత్ అధ్యక్షులు నరేందర్ గౌడ్, మాజి ఎంపిటిసి భాస్కర్ నాయక్, యాదవ రెడ్డి, గుడాల నాగులు, సంపత్ రెడ్డి, బందారపు శ్రీనివాస్, పప్పు పోచయ్య, కుమార స్వామి, లావుద్య జవహర్, సంగ కుమార్, సంగ శ్రీధర్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు భోనగిరి రజిత, పచ్చి మట్ల రాధ, గడిపే రమ, బ్లాండిన సుధాకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు మ్యదర బోయిన శ్రీకాంత్ యాదవ్, మారుపాక గణేష్, రమేష్ నాయక్, రాజు, గుడికందుల రాజు, ఆదరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## బలిజ సంఘము నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 8. జనవాహిని న్యూస్.
పట్టణంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం 2024 నూతన క్యాలెండర్ను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. వక్తలు మాట్లాడుతూ బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృష్ణదేవరాయల బలిజ సంఘము కులదీపకుడు శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటుకు పెట్రోల్ బంక్ కూడలిలోని 4 లైన్ రోడ్డులో పోలీసు స్టేషన్ వద్ద శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాడని అన్నారు. ఈ విగ్రహం ఏర్పాటుకు సంగీయులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అవుకు బలిజ సంఘము అధ్యక్షుడు దంతేల రమణ,బనగానపల్లె మండల సంగం అధ్యక్షుడు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు సూరా రామసుబ్బయ్య, పలుకూరు నీలి రమేష్, నీలి శ్రీనివాసులు, రామసుబ్బారెడ్డి, యు.రాజశేఖర్, సాదుకొట్టం శ్రీను, ఎయిర్టెల్ మనోహర్, గోవిందిన్న శంకర్ రెడ్డి, చెర్వుపల్లె సూర్య నారాయణరెడ్డి, యాగంటి శ్రీను, జోలాపురం రాందాస్ రెడ్డి, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

## పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపిన కుమారుడు




(డిసెంబర్ 08జనవాహిని న్యూస్) ( బంట్వరం)
మండల కేంద్రంలో 24 గంటలు అందుబాటులో ఉండే అంబులెన్స్ లో అత్తోత్సవం సరుకులు. మహేష్, తన తల్లిదండ్రుల పెళ్లి రోజును, ఘనంగా జరిపారు బాధ్యతతో కూడిన ప్రేమకు తోడైన రోజుది... ఒక మనసుకు ఇంకొక మనసు తోడైన రోజుది... రెండు హృదయాలు ఒక ఆత్మగా అవతరించిన ప్రత్యేకమైన రోజుది.... కష్టాలు ఎన్నైనా ఎదుర్కోవడానికి ముచ్చటపడి ముందుకొచ్చిన జంట ఏకమైన రోజుది.... ఒంటరి జీవితానికి తోడు దొరికిన సమయం ఇది... నాన్న జీవితాన్ని సగ భాగం చేసి అమ్మకు అప్పజెప్పిన రోజుది... దాంపత్యం అంటే ఒక అద్భుతమైన స్నేహబంధమని తెలుసుకున్న రోజుది.... నేల ఒకరై నింగి ఒకరై సృష్టి మొత్తం ఆక్రమించిన రోజుది... అనుబంధానికి రుణబంధం జత కలిసిన రోజుది.... అక్షింతలు ఆశీస్సులు తలంబ్రాలు తామర పువ్వులై వికసించిన మధుర గడియ ఇది.... ఇద్దరూ మనుషులే కాదు రెండు కుటుంబాలు ఏకమైన శుభ ఘడియ ఇది... ప్రతి నిమిషం ఆహ్లాదభరితమైన ఉత్సాహాన్ని నింపుకోవాలని మా అమ్మ నాన్నలా జంట ఇలాగే కలకాలం సంతోషన్ని అనుభవిస్తూ నిత్యం నూతన ఉత్సాహంలో ఉండాలనీ మనసారా కోరుకుంటూ మా ప్రియమైన అమ్మ నాన్నలకి పెళ్లిరోజు శుభాకాంక్షలు అంటూ తెలిపిన తీరు వర్ణదితం.. కొడుకులు ,కూతుళ్ళు మోహన్,మహేశ్వరి, మనిచందనా,నవదీప్,వెన్నెల అశ్విని, శాలిని

## హైదరాబాద్ లోని నారాయణగూడ సీపిఐ కార్యాలయంలో మిత్ర పక్షంలో భాగంగా తమ మద్దతు పూర్తి స్థాయిగా ఇచ్చి కాంగ్రెస్ గెలుపులో తమ వంతు కృషి చేసిన సిపిఐ నాయకుల కు పొన్నం కృతజ్ఞతలు




(జనవాహిణి స్టాఫ్ రిపోర్టర్ చిట్యాల భానుబాబు ) సీపీఐ రాష్ట్ర మరియు సిదిపేట , వరంగల్ ,కరీంనగర్ జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రి హుస్నాబాద్ ఎమ్మెల్యే శ్రీ పొన్నం ప్రభాకర్ గారుఈ సదర్భంగా సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి శ్రీ సురవరం సుధాకర్ రెడ్డి గారు ,సీపీఐ తర్పున గెలిచిన కొత్తగూడెం ఎమ్మెల్యే కునమనేని సాంబశివ గారు , సీపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు శ్రీ చాడ వెంకటరెడ్డి రెడ్డి గారినీ కలిసి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మనకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ గారు , సీపిఐ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ గారు మరియు హుస్నాబాద్ సీపీఐ నాయకులు కొయ్యడ సృజన కుమార్ తదితరులు పాల్గొన్నారు!

# వార్షిక పరీక్షలకు విద్యార్థులను ఉత్తమంగా సన్నద్ధం చేయండి

## సంక్షేమ గురుకులాల డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ డి వెంకట లక్ష్మి




రాబోయే వార్షిక పరీక్షలకు విద్యార్థులను కాన్ఫిడెంట్గా పరీక్షలు రాసేలా సన్నద్ధం చేయాలని సంక్షేమ గురుకులాల డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ డి వెంకటలక్ష్మి అన్నారు . శుక్రవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సి ఓ ఈ), బెల్లంపల్లిలో మైక్రో అకాడమిక్ రివ్యూ కాంక్లేవ్ (మార్క్ 2023) కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ను మరియు ఉపాధ్యాయులను ఉద్దేశించి అన్నారు ఆదిలాబాద్ రీజియన్ కు సంబంధించిన 17 గురుకులాల విద్యార్థుల ప్రగతిపై సంక్షేమ గురుకులాల డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ డి వెంకట్ లక్ష్మి ప్రత్యేకంగా సమీక్షించారు.ఈ కార్యక్రమానికి సంక్షేమ గురుకులాల అకడమిక్ డిప్యూటీ సెక్రెటరీ డాక్టర్ డి. వెంకట్ లక్ష్మితోపాటు ఆర్సీఓ కొప్పుల స్వరూపారాణి హాజరయ్యారు.స్థానిక ప్రిన్సిపల్ ఐనాల సైదులు కార్యక్రమం ఉద్దేశాలను సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు వివరించారు . అదిలాబాద్ రీజియన్ పరిధిలోని 17 సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ లో సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్ష ఫలితాలు మరియు యూనిట్ టెస్ట్ లలో వచ్చిన మార్కులపై సమీక్షించారు. సబ్జెక్టు ఎక్స్పర్ట్స్ తో విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ బోర్డ్ నిబంధనలతో అనుకూలంగా ఉన్నాయో లేదో పరిశీలించారు .అనంతరం సంబంధిత ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆన్సర్ పేపర్లను సమీక్షిస్తూ గత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను రీజనల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూప రాణి వివరించారు.అనంతరం డిప్యూటీ సెక్రెటరీ వెంకట్ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనోపకరణాలను ఉపయోగించి బోధిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. 100% ఫలితాలు మాత్రమే కాకుండా నాణ్యమైన విద్యను అందించడం సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు.ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఉపాధ్యాయులు అంకితభా వంతో పనిచేయాలని సూచించారు. గత విద్యా సంవ త్సరం అదిలాబాద్ రీజియన్ లోని 17 గురుకులాలు రాష్ట్రంలో ముందంజలో ఉన్నాయన్నారు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఆదిలాబాద్ రీజియన్ పాత్ర వెలకట్టలేనిది అన్నారు. కార్యక్రమంలో ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి డీఎస్, ఆర్ సి ఓ ప్రిన్సిపల్స్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆసిఫాబాద్ మంచిర్యాల జిల్లా సమన్వయ అధికారులు సంగనభట్ల శ్రీనివాస్ పోలోజు బాలరాజు రామల బాల భాస్కర్ స్థానిక ప్రిన్సిపల్ సైదులు 17 గురుకులాలకు సంబంధించిన ప్రిన్సిపల్స్ స్వర్ణలత, ప్రేమరాణి ,కుమ్మరి మోహన్, వినోద్, ఊటూరి సంతోష్ ,శ్రీనాథ్,సంధ్యారాణి, సంగీత ,పచ్చల జ్యోతి ,సరిత, రమేష్ బాబు, స్వరూప ,సీనియర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు విషయ నిపుణులు కోటి చింతల మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## TRTF జిల్లా కార్యవర్గ సమావేశం



వికారాబాద్ జిల్లా స్టాపర్ డిసెంబర్ 8 తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ వికారాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కావలి అశోక్ కుమార్ గారు హాజరయ్యారు సంఘం కార్యవర్గ సభ్యులు తమ తమ అభిప్రాయాలను ఉపాధ్యా యుల సమస్యల గురించి తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా నూతన కమిటీని అశోక్ కుమార్ సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది , వికారాబాద్ జిల్లా అధ్యక్షులుగా %ాణ% అఫ్జల్ గారు , జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాంచంద్రయ్య గారు ఉపాధ్యక్షులుగా %ూా% వెంకటయ్య గారిని ఎన్నుకోవడం జరిగింది..

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

### – డిపో మేనేజర్ సురేఖ



గజ్వేల్ ఎండీ యూసుఫ్ /కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలలో నేటినుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం , ఆరోగ్యశ్రీ 10 లక్షల పెంపు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుండగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు అని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ సురేఖ తెలిపారు. ఆర్టీసీ ఉన్నత అధికారుల చేతులమీదుగా నేడు మధ్యాహ్నం ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. మహిళలు ప్రయాణం చేసేటప్పుడు సంబంధించిన ఆధార్ గుర్తింపు కార్డులను కండక్టర్ కు చూపించాలన్నారు . విద్యార్థులకు మహిళా ఉద్యోగులకు కూడా ఈ సౌకర్యం వర్తిస్తుందని ఆమె తెలిపారు .పరిమితి కిలోమీటర్లు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడినుంచి అయినా ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చని ఆమె తెలిపారు. ఈ సౌకర్యాన్ని పల్లె వెలుగు ఎక్స్ ప్రెస్ బస్సులలో మాత్రమే ప్రయాణించాలని ప్రయాణికుల రద్దీ దృష్ట అందరికీ సరిపడా బస్సులు అన్ని రూట్లలో బస్సులు ఉంటాయని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ సురేఖ తెలిపారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే చేపట్టాలి

పోత్నాక్ ప్రమోద్ కుమార్.



భువనగిరి హౌసింగ్ బోర్డ్ లోని 10 26 వార్డులోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి రోడ్డుపై నీరు ప్రవహిస్తుందని వెంటనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ గారు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి గారినీ కోరడం జరిగింది. ఈరోజు ఉదయం వార్డు పర్యటనలో భాగంగా టిటిడి కళ్యాణ మండపం మెయిన్ రోడ్ బలరాం రెడ్డి ఇంటి ముందు రోడ్డు నుండి డ్రైనేజీ లీకు అయ్యి గత పది రోజులుగా మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజల ఇబ్బందులను వార్డు పర్యటన భాగంగా మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి గారికి వివరించడం జరిగింది.టిటిడి కళ్యాణ మండపం మెయిన్ రోడ్ బలరాం రెడ్డి ఇంటి నుంచి కొత్త పైప్ లైన్ ను వెంటనే వేయాలని కోరడం జరిగింది. దీనికి కమిషనర్ గారు వెంటనే స్పందించి కొత్త పైప్ లైన్ ను వెంటనే వేస్తామని నేడు లేదా రేపు పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చినారు. కాంట్రాక్టర్ హరినాధుని పిలిపించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.వార్డు పర్యటనలో సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు వార్డు ప్రజలు బలరాం రెడ్డి, శేఖర్, ఎండీ అమనత్, రత్న రాజశేఖర్ మున్సిపల్ సిబ్బంది నర్సింగ్,శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం పనిచేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

### – మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



గజ్వేల్ ఎండీ యూసుఫ్/
రైతుల సంక్షేమం కోసం పనిచేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రైతుల సమస్యలపై ఆయన అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రైతులకు సరైన గిట్టుబాటు ధరలు లేక కొనుగోలు కేంద్రాలు లేక దళారులను ఆశ్రయించారని రైతుల సంక్షేమం కోసం 24 గంటలు ఉచిత విద్యుత్ సకాలంలో ఎరువులు విత్తనాలు రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని ఆయన అధికారులను కోరారు.

మీజాగ్ తుఫాన్ వల్ల తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగారెడ్డి , నాయిని యాదగిరి, ముత్యాలు గొల్లపల్లి నరేందర్ రెడ్డి, మొనగారి రాజు రెడ్డి, నక్క రాములు గౌడ్ , గుండనపల్లి సత్యనారాయణ, గుండు లక్ష్మణ్ , నేత నాగరాజు మైనార్టీ నాయకులు అజ్గర్ యూత్ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ రెడ్డి ,టిల్లురెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫామ్ హౌస్ బాత్ రూంలో కాలుజారి కిందపడ్డ కేసీఆర్..



గజ్వేల్
మాజీ సీఎం కేసీఆర్ ఎడమకాలికి తీవ్ర గాయం.. అర్ధరాత్రి తర్వాత ఫామ్ హౌస్ బాత్ రూంలో కాలుజారి కిందపడ్డ కేసీఆర్.. సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో కేసీఆర్ కు చికిత్స.. కేసీఆర్ తుంటి ఎముక విరిగినట్లు తెలిపిన యశోద ఆసుపత్రి వైద్యులు.. 10 గంటల తరువాత కొన్ని పరీక్షలు నిర్వహించే అవకాశం..

## కాంగ్రెస్ నాయకుడు గృహప్రవేశం కి హాజరైనా రాష్ట్ర మంత్రి పొన్నం

### మానకొండూర్ శాసనసభ్యులు కావ్వంపెల్లి సత్యనారాయణ



(కరీంనగర్ జనవాహిణి స్టాఫ్ రిపోర్టర్ చిట్యాల భానుబాబు ) కరీంనగర్ జిల్లా శంకరపట్నం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హైదరాబాద్ లోని గాజుల రమారం లో కరీంనగర్ జిల్లా కేశవపట్నం కి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బత్తినీ శ్రీనివాస్ గౌడ్ గారి కుటుంబ సభ్యుల గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు మరియు మనకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గారు

## ఆర్జీ-3 & ఏపీఏ ఏరియాల్లో పర్యటించిన ఎం ఇ సి ఎల్ డైరెక్టర్





పెద్దపల్లి:రామగిరిబీ(జనవాహిని స్టాఫ్ రిపోర్టర్ రమేష్)
సింగరేణి ఆర్జీ-3 %ు% ఏపీఏ ఏరియాలో ఎం ఇ సి ఎల్( మినరల్ ఎక్స్ప్లోరేషన్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్) డైరెక్టర్( టెక్నికల్) శ్రీ పంకజ్ పాండే శుక్రవారం సందర్శించారు.

ముందుగా జీఎం కార్యాలయం నందు జరిగిన సమీక్ష సమావేశం నందు పాల్గొని పి పి టి ద్వారా ఓసిపి - 2 ఉపరితల గని వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఓసిపి -2 ఉపరితల గనిని సందర్శించి వ్యూ పాయింట్ నుండి పనులను పరిశీలించారు. గని లోని ఇన్ పిట్ క్రషర్, స్ప్రైడర్ లను సందర్శించి పరిశీలించారు. వీరికి ఆర్జీ-3 జీ ఎం శ్రీ ఎన్. సుధాకర రావు గని వివరాలను తెలియజేశారు. అలాగే ఏ ఎల్ పి గని లో గల ఎయిర్ చిల్లింగ్ ప్లాంట్ సందర్శించారు.

డైరెక్టర్ శ్రీ పంకజ్ పాండే మాట్లాడుతూ ఈ గనుల నందు ఉపయోగిస్తున్న అత్యుత్తమ టెక్నాలజీ గల యంత్రాల పనితీరు చాలా బాగుందని అన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ పి .ఎలీషా, ప్రాజెక్ట్ అధికారి కే .రాజేందర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎం. నాగరాజు, ఎస్ ఓ ఎం కే. జనార్ధన్, జియాలజిస్ట్ శివ నారాయణ, ఇన్చార్జి మేనేజర్ అనుగ్రహ నారాయణ, సర్వే అధికారి జి. లక్ష్మి రాజు, సేఫ్టీ అధికారి ఆసిఫ్ యాసిన్ లతోపాటు ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## సోనియా గాంధీ త్యాగం మరువలేనిది

వలిగొండ డిసెంబర్ 8
మలిదశ తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను చూసి చలించిపోయి రెండు రాష్ట్రాల్లో పార్టీ దెబ్బతింటుందని తెలిసి కూడా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ త్యాగం మరువలేనిదని మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పులిపలుపుల రాములు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేడు జన్మదినం జరుపుకుంటున్న సందర్భంగా సోనియా గాంధీకి తెలంగాణ రాష్ట్ర ప్రజల తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సోనియాగాంధీ ఆశయ సాధన కోసం రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. నేడు పదవి ప్రమాణ స్వీకారం చేయనున్న భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అదేవిధంగా 40 సంవత్సరాల చరిత్రను తిరగరాసి భువనగిరి ఖిల్లా పై కాంగ్రెస్ జెండా ఎగురవేసినందుకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

# సంపాదకీయం

## ఇండియా కూటమిలో అప్పుడే లుకలుకలు

మూడు రాష్ట్రాల్లో ఓటమితో కాంగ్రెస్‌కు మళ్లీ భంగపాటు తప్పలడం లేదు. ఇండియా కూటమిలో లుకలుకలు బయటపడ్డాయి. కాంగ్రెస్‌ను నమ్మేందుకు ఇతర పార్టీలు సిద్దంగా లేవు. ఇది ఓ రకంగా ఇండియా కూటమి మనుగడను సవాల్ చేసేదిలా ఉంది. అందుకే ఢిల్లీలో జరగాల్సిన కూటమి భేటీ వాయిదా పడింది. మమతా బెనర్జీ, నితీశ్ కుమార్ లాంటి వారు హాజరు కాబోమని తేల్చి చెప్పారు. త్వరలో పార్లమెంట్‌కు ఎన్నికలు జరుగబోతున్న తరుణంలో ఇది కాంగ్రెస్‌కు శరీఘాతంగా చూడాలి. ఎన్నికల ముందున్న ఉత్సాహం ఇప్పుడు ఫలితాల తరవాత కానరావడం లేదు. ఆమ్ ఆద్మీకి కూడా గట్టి దెబ్బ తగిలింది. తాము కోల్పోయిన ఓబీసీ, దళిత, ఆదివాసీ, మైనారిటీ ఓటు బ్యాంకును తిరిగి పొందేందుకు కాంగ్రెస్ చేసిన ఎత్తుగడ ఫలించలేదు. మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో కులగణన అంశం తెరపైకి తెచ్చినా.. ఫలించలేదు. దేశాన్ని ఏకం చేసే విషయాలను వదిలి విచ్ఛిన్నం చేసే కులగణనపై బిజెపి గట్టిగానే ఎదరించింది. కులాలు వద్దంటూనే కులగణన తేవాలన్న ఆలోచనలపై ప్రధాని మోడీ గట్టిగానే వ్యతిరేకిం చారు. సమాజంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని విమర్శలు గుప్పించారు. మూడు రాష్ట్రాలతో పాటు తెలంగాణ ఫలితాలను విశ్లేషిస్తే.. ఉత్తరాదిలో బిజెపిని ప్రజలు ఆదరించారు. ఇది ఓరకంగా మోడీకి విజయంగానే భావించాలి. తెలంగాణ ఎన్నికలు కేవలం కెసిఆర్ అహంభావంపై తిరుగుబాటుగా చూడాలి. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు ప్రజలను పట్టించుకోలేదు. ఎన్నికలయ్యాక బస్సుల్లో జనాలను ఫామ్‌హౌజ్‌కు పిలిపించి మాట్లాడడం కెసిఆర్ నైజం తెలిసిపోయింది. అధికారంలో ఉంటే కలవకపోవడం.. లేకుంటే రా రమ్మని పిలవడం ప్రజలు గమనించారు. మొత్తంగా దేశంలో బిజెపికి ఆదరణ



పెరుగుతోందని అర్థం అయ్యింది. తెలంగాణలో కూడా బిజెపి బిఆర్ఎస్‌తో లోపాయకారిగా ఒప్పందం చేసుకుని భంగపడింది. లేకుంటే ఇక్కడ పరిస్థితి మరోలా ఉండేది. అయితే తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రజలకు చేరువయ్యేలా చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలు ఇవ్వవచ్చు. ఇకపోతే దేశంలో కులగణనను విడిచి పెట్టి అభివృద్ధి, వెనకబాటు తనంపై పార్టీలు పోరాడాలి. కలుగణన అంశాన్ని ఆధారంగా అందలం ఎక్కాలని చూసే పార్టీలకు భంగపాటు తప్పదని ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఫలితాలు తేల్చాయి. బిహార్‌లో కులాల ఆధారంగా జరిగిన సర్వే ప్రకటించిన తర్వాత దేశంలో కాంగ్రెస్‌కు ఒక బలమైన సైద్ధాంతిక భూమిక లభించింది. మోదీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును మోదీ ఆమోదింపజేశాక, మహిళా ఓటు బ్యాంక్ దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో ప్రతిపక్షాలు తమ వ్యూహాన్ని మరింత పటిష్ఠం చేసుకునే అవకాశాన్ని కులగణన ద్వారా పొందాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో దీనిని జాతీయ ఎజెండా చేయాలని ప్రయత్నించి భంగపడ్డాయి. హిందూత్వ ప్రభావ పరిధిలోంచి ఆయా కులాలు బయటపడకుండే చూడాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ లక్ష్యంగా ఉంది. కులగణన ద్వారా హిందువులు విభజనకు గురికాకుండా ఐక్యం చేయాలన్నది మోడీ ఆలోచన. దానిని గండికొట్టి లబ్దిపొందాన్నది కాంగ్రెస్ ఎజెండా. అయితే కులాల అస్తిత్వాన్ని, వాటికి లభిస్తున్న అవకాశాలను ఒక చర్చనీయాంశంగా మార్చి తమకు అనుకూలంగా మార్పు చేసేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ప్రయత్ని స్తున్నాయి. ఒక రకంగా ప్రతిపక్షాల ఎజెండా బీజేపీ హిందూత్వ వాదానికి ఒక సవాల్ లాంటిదనే చెప్పాలి. కాంగ్రెస్ విషయానికి వస్తే కర్ణాటక ఎన్నికల్లోనే సామాజిక న్యాయాన్ని తన అస్త్రంగా ఉపయోగించుకుంది. అదే అస్త్రాన్ని ఇప్పుడు జాతీయ స్థాయిలో ఉపయోగించుకునేందుకు వ్యూహరచన చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నాటికి దీనిని పెద్ద ఎజెండా తీసుకుని

వెళ్ళడం ద్వారా చేస్తున్న ప్రయత్నాలు కాంగ్రెస్ లేదా ఇతర పార్టీలకు లాభించకపోవచ్చు. కులజనగణన నిర్వహించాలని కాంగ్రెస్ తాజాగా డిమాండ్ చేయడం అందు లో భాగమే. మహిళా రిజర్వేషన్‌లోనూ ఓబీసీలకు సైతం కోటా కావాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. జనాభాకు తగ్గట్లుగా ఆయా వర్గాలకు హక్కులు లభించాలని డిమాండ్ తెరపైకి తేవడంలో కాంగ్రెస్ ఓటుబ్యాంక్ రాజకీయం దాగివుంది. ఒక్క మధ్యప్రదేశ్‌లోనే 45 శాతం ఓబీసీలు ఉన్నారు. ఆ రాష్ట్రంలో కమల్‌నాథ్ 15 నెలల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఓబీసీ కోటాను 14 నుంచి 27 శాతానికి పెంచారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి రెండు రోజుల ముందే రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ తన రాష్ట్రంలో కూడా కుల జనగణన జరిపిస్తానని ప్రకటించారు. ఓ సర్వే ప్రకారం రాజస్థాన్‌లో కూడా 35 నుంచి 40 శాతం ఓబీసీలు ఉన్నారు. ఈ వర్గాలు అధికంగా ఉన్న రాజస్థాన్, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్‌కు సానుకూల ఫలితాలు లభిస్తాయని, అది జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పూర్వవైభవానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ భావించింది. గతంలో మండల్ కమిషన్‌ను సమర్థించిన పార్టీలన్నీ ఇప్పుడు 'ఇండియా' కూటమిలో ఉండడం ద్వారా కులగణనకు డిమాండ్‌ను బలంగా తీసుకుని వచ్చింది. అయితే ఈ మూడు రాష్ట్రాల్లో ఈ అంశాన్ని ప్రజలు పెద్దగా ఆదరించలేదు. కులగణన ద్వారా లాభం లేదని ప్రజలు కూడా గమనించారు. నిజానికి ఇప్పుడు బిజెపి గెలిచిన ఈ మూడ రాష్ట్రాలు గతంలో కాంగ్రెస్ గెలిచినవే. అయితే మధ్యప్రదేశ్‌లో మాత్రం బిజెపి ఎత్తులకు కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. మొత్తంగా కాంగ్రెస్ ఓటమితో ఇండియా కూటమి కూడా బలహీనపడినట్లుగానే భావించాలి. తెలంగాణలో గెలుపును అన్ని పార్టీలు కూడా కెసిఆర్‌పై వ్యతిరేక ఓటుగానే భావిస్తున్నాయి. అందుకే కాంగ్రెస్ ఓటమితే ఇండియా కూటమి ముందుకు సాగడం అనుమానంగానే ఉంది.

# ఇంట్లో జారిపడ్డ మాజీ సీఎం కెసిఆర్

- హుటాహుటిన యశోదాకు తరలింపు
- తుంటి ఎముకు విరిగినట్లు గుర్తించిన వైద్యులు
- ఆపరేషన్ చేయాలని వైద్యుల నిర్ణయం
- కెసిఆర్ ఆరోగ్యంపై సిఎం రేవంత్ స్పందన
- పర్యవేక్షించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వికి ఆదేశం



హైదరాబాద్,డిసెంబర్8 మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అర్ధరాత్రి ఫామ్ హౌస్ బాత్ రూమ్‌లో జారి పడటంతో ఆయన తొంటికి తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబసభ్యులు ఆయనను యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యశోదాలో కేసీఆర్‌కు చికిత్స కొనసాగుతోంది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని, యశోదా ఆస్పత్రి వద్ద భద్రత పెంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వి యశోద హాస్పిటల్‌కు వెళ్లారు. యశోద ఆసుపత్రి వైద్యులను అడిగి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని హెల్త్ సెక్రటరీకి యశోద వైద్యులు తెలియజేశారు. కేసీఆర్‌కు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించిన విషయం తెలిసిందే. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్లియరెన్స్‌తో కేసీఆర్‌ను పోలీస్ అధికారులు ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. కేసీఆర్ ఎడమ తుంటి ఎముక విరిగినట్లు తెలిపారు. ఆపరేషన్ చేసి తుంటి ఎముక రీప్లేస్ చేయనున్నట్లు చెప్పారు. కేసీఆర్ కోలుకునేందుకు 6 నుంచి 8 వారాలు పడుతుందని యశోద వైద్యులు బులెటిన్‌లో వెల్లడించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అధినేత ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రిలోని వివిధ విభాగాల వైద్యులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆయనకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి యశోద ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకు న్నారు. గురువారం అర్ధరాత్రి ఆయన కాలు జారి కిందపడటంతో తీవ్ర గాయమైంది. వెంటనే ఆయనను సోమాజిగూడ యశోదా హాస్పిటల్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు కేసీఆర్ తుంటి ఎముక విరిగినట్లు గుర్తించారు. దీంతో ఐసీయూకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, శుక్రవారం సాయంత్రం కేసీఆర్‌కు హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయనున్నారు. మరోవైపు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోదీ కూడా స్పందించిన విషయం తెలిసిందే.కేసీఆర్‌కు గాయమైన విషయం తెలియగానే చాలా బాధపడ్డట్లు ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని, మంచి ఆరోగ్యంతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యంపై ఎమ్మెల్సీ కవిత సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్‌కు స్వల్ప గాయమైందని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. ఆయన త్వరలోనే కోలుకుంటారని వెల్లడించారు. కేసీఆర్‌పై ప్రజల ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్‌కు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు యశోద ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేయనున్నారు. కేసీఆర్‌కు తొంటి ఎముక రెండు చోట్ల విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు ఆపరేష్ చేయాల్సి ఉంటుందని ఇప్పటికే వైద్యులు వెల్లడించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీకి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి యశోద ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులతో మాట్లాడి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.హెల్త్ బులెటిన్ విడుదల.. కేసీఆర్ హెల్త్ బులెటిన్‌ను యశోద ఆస్పత్రి వైద్యులు విడుదల చేశారు. కోలుకునేందుకు 6 నుంచి 8 వారాలు పడుతుందన్నారు. ప్రస్తుతం కేసీఆర్ వైద్యుల పరిరక్షణలో ఉన్నట్లు తెలిపారు. కాగా గురువారం రాత్రి ఫామ్ హౌస్ బాత్ రూమ్‌లో జారి పడ్డారు. దీంతో ఆయన తొంటికి తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు ఆయనను యశోద ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టరు

తుంటి ఎముక రెండు చోట్ల విరిగినట్లు గుర్తించారు. ఈ రోజు ఆయనకు శస్త్ర చికిత్స చేయనున్నారు. తుంటి ఎముకకు స్టీల్ ప్లేట్స్ వేసే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. తుంటి బాల్ కూడా డ్యామేజ్ అయినట్లు వైద్య బృందం గుర్తించింది. కాగా హాస్పిటల్‌లో కేసీఆర్ వెంట కవిత, కేటీఆర్, హరీష్ రావు ఉన్నారు.

# ఎమ్మెల్యేగా ప్రమాణం చేయను..

## సంచలన ప్రకటన చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్





కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా కొలువుదీరలేదు. అప్పుడే ప్రతిపక్షాల నుంచి విమర్శలు మొదలయ్యాయి, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు.మూడో సారి ఎన్నికైన తెలంగాణ అసెంబ్లీ తొలిసారి సమావేశం కాబోతోంది. శనివారం ఉదయం జరిగే అసెంబ్లీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు అంతా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ ప్రత్యేక అసెంబ్లీ భేటీకి ప్రొటెం స్పీకర్ గా ఎంఐఎం సీనియర్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ వ్యవహరించబోతున్నారు. అయితే, అసెంబ్లీ తీరుపై భారతీయ జనతా పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మండిపడుతున్నారు. అక్బరుద్దీన్ ఒవైసీ ప్రోటెం స్పీకర్ అయితే ఎమ్మెల్యేగా ప్రమాణం చేసేదీ లేదని తేల్చి చెప్పారు. పూర్తి స్థాయి స్పీకర్ బాధ్యతలు చేపట్టాక ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తామన్నారు రాజాసింగ్.ఇదిలావుంటే, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు భారతీయ జనతా పార్టీ కీలక పదవి ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బీజేఎల్పీ నేతగా రాజాసింగ్ నియమితులయ్యే అవకాశం కనిపిస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో ఆయనకు ఈసారి ఛాన్స్ వస్తుందని పార్టీ కేడర్ భావిస్తోంది. ఇక ఏలేటి మహేశ్వర్ రెడ్డిని బీజేఎల్పీ ఉపనేతగా నియమించే అవకాశముంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఈసారి 8 మంది ఎమ్మెల్యేలు విజయం సాధించారు. అందులో ఆరు మంది కొత్తవారు కాగా, ఇద్దరే సీనియర్లు కావడంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకునే అవకాశముంది.మరోవైపు రేవంత్ రెడ్డి సర్కార్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కంటే ఎక్కువ ఉండకపోవచ్చన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడం సాధ్యం కాదన్న రాజాసింగ్, కేసీఆర్ తెచ్చిన అప్పులకు వడ్డీలే కట్టలేకపోతున్నారన్నారు.

పథకాల అమలుకు డబ్బు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. బ్యాంకులు కొత్త అప్పులు ఇచ్చే పరిస్థితి లేదన్న ఆయన.. తెలంగాణను నడపాలంటే ఒక్క బీజేపీతోనే సాధ్యం అన్నారు రాజాసింగ్.

# టీఎంసీ ఎంపీ మహువా మెయిత్రాపై బహిష్కరణ వేటు

న్యూఢిల్లీ,డిసెంబర్8: డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే ఆరోపణలను ఎదుర్కొంటున్న టీఎంసీ ఎంపీ మహువా మెయిత్రా పై బహిష్కరణ వేటు పడింది. పార్లమెంటు నైతిక విలువల కమిటీ ఇచ్చిన నివేదికను లోక్‌సభ ఆమోదించింది. ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరించాలంటూ 500 పేజీల నివేదకలో ఎథిక్స్ కమిటీ సిఫారసు చేసింది. దీనిపై చర్చ జరిపిన అనంతరం ఓటింగ్ నిర్వహించారు. నివేదికను లోక్‌సభ ఆమోదించడంతో ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరిస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.నివేదికపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేతలు అధీర్ రంజన్ చౌదరి,

మనీష్ తివారీ తదితరులు మహువా మొయిత్రీని మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అయితే అందుకు స్పీకర్ నిరాకరించారు. లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడంపై మహువా మొయిత్రా పార్లమెంటు వెలుపల నిప్పులు చెరిగారు. బహిష్కరించే హక్కు ఎథిక్స్ కమిటీకి లేదని అన్నారు. ఇది మీ (బీజేపీ) ముగింపునకు ఆరంభం అంటూ ఘాటుగా విమర్శించారు.

# విచారణ పేరుతో ఎక్కువ కాలంలో జైలులో ఉంచడం సరికాదు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,డిసెంబర్8: లిక్కర్ పాలసీ కేసులో దర్యాప్తు సంస్థల సుదీర్ఘ విచారణ తీరుపై సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారంనాడు అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణ పేరుతో సుదీర్ఘ కాలం ఎవరినీ కటకటాల వెనుక ఉంచడం సరికాదని స్పష్టం చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. పేరనోడ్ రికార్డ్ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ బినయ్ బాబుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. "విచారణకు ముందు ఎక్కువకాలం ఎవరినీ మీరు జైలులో ఉంచరాదు. ఇది సరికాదు. ఇలా ఎందుకు జరుగుతోందో మాకు తెలియడం లేదు. సీబీఐ, ఈడీ చేస్తున్న ఆరోపణలు పరస్పర విరుద్ధంగా ఉంటున్నాయి" అని జస్టిస్ సంజీవ్ ఖన్నా అభిప్రాయపడ్డారు. బినయ్ బాబు ఇప్పటికే 13 నెలలు జైలులో ఉన్నారని జస్టిస్ ఎస్వీఎన్ భట్‌తో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణం కేసులో పలువురుని అరెస్టు చేయడం బీజేపీ, విపక్షాల మధ్య రాజకీయ వివాదం సృష్టించింది. ముఖ్యంగా ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ఈ అరెస్టులను తీవ్ర స్థాయిలో తప్పుపట్టింది. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో సహా ఇద్దరు సీనియర్ ఆప్ నేతలను ఈ కేసులో అరెస్టు చేశారు. సిసోడియా గత ఫిబ్రవరి నుంచి జైలులోనే ఉండగా, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్



అక్టోబర్ నుంచి జైలులో ఉన్నారు. గత అక్టోబర్‌లో మనీష్ సిసోడియాకు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే ఈ ఉత్తర్వును పునఃసమీక్షించాలని కోరుతూ సిసోడియా గతవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గత ఫిబ్రవరి 26న సిసోడియాను సీబీఐ అరెస్టు చేసింది. తీహార్ జైలులో ఈడీ సుదీర్ఘ విచారణ జరిపి రెండు వారాల తర్వాత మార్చి 9న ఆయనను అరెస్టు చేసింది. ఢిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న సవరించిన లిక్కర్ ఎక్సైజ్ పాలసీని అమల్లోకి తెచ్చింది. అయితే అవినీతి ఆరోపణలు రావడంతో ఏడాది లోపే లిక్కర్ పాలసీ అమలును రద్దు చేసింది. హోల్‌సేలర్ల మార్జిన్ లాభం అసాధారణ రీతిలో 5 నుంచి 12 శాతం పెంచేసినట్టు దర్యాప్తు సంస్థల అభియోగంగా ఉంది.

# రేపట్నుంచే మహిళలకు ఉచిత ప్రయాణం.. మార్గదర్శకాలు ఇవే..

హైదరాబాద్: మహాలక్ష్మి స్కీమ్‌లో భాగంగా రేపటి(శనివారం) నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నట్లు టీఎస్ఆర్టీసీ సీఎండీ సజ్జనార్ తెలిపారు.ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు అసెంబ్లీ వద్ద సీఎం రేవంత్రెడ్డి 'మహాలక్ష్మీ స్కీమ్'ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొంటారని చెప్పారు.రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఫ్రీగా జీరో అమౌంట్ టికెట్‌తో ప్రయాణించవచ్చని తెలిపారు. ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నాలుగైదు రోజులు గుర్తింపు కార్డు లేకుండా ప్రయాణించవచ్చని తెలిపారు. ప్రయాణీకుల సంక్షేమం కోసం ఆర్టీసీ యాజమాన్యం కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఫ్రీ ప్రయాణం మంచి స్కీమ్ అని కొనియాడారు. స్కీమ్‌తో ఆర్టీసీకి ఆదరణ మరింత పెరుగుతోందని చెప్పారు.ప్రస్తుతం రోజుకు 40 లక్షల మంది ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తారని వెల్లడించారు. ప్రజలు ఎక్కడ ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు.



ప్రస్తుతం 7290 బస్సులు ఉన్నాయని, రోజు ఆదాయం 14 కోట్ల వరకు వస్తోందని తెలిపారు. మహిళలకు ఫ్రీ ప్రయాణంతో 50 శాతం ఆదాయం తగ్గుతుందని పేర్కొన్నారు. తగ్గే ఆదాయంపై ప్రభుత్వ సహాయంకై విజ్ఞప్తి చేశామని చెప్పారు.




# ఆర్‌బీఐ కీలక నిర్ణయం,

యూపీఐ పేమెంట్స్ చెల్లింపు దారులకు శుభవార్త!




యూపీఐ ఖాతాదారులకు శుభర్తవార్త. యూపీఐ ట్రాన్సాక్షన్ లిమిట్‌ను పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత్ దాస్ కీలక ప్రకటన చేశారు.ఈ సందర్భంగా యూపీఐ ద్వారా చేసే జరిపే కొన్ని ట్రాన్సాక్షన్‌లకు సంబంధించిన లావాదేవీల లిమిట్‌ను పెంచుతున్నట్లు తెలిపారు.తాజాగా, జరిగిన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం.. యూపీఐ ట్రాన్సాక్షన్ లిమిట్ గతంలో రోజుకు రూ.25,000 నుంచి రూ.1లక్ష వరకు చేసుకునే అవకాశం ఉంది. తాజాగా, యూపీఐ ద్వారా చేసే చెల్లింపులను రూ.5లక్షల వరకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ట్రాన్సాక్షన్‌లలో హాస్పిటల్స్ బిల్స్, ఎడ్యుకేషన్ ఫీజులు సైతం ఉన్నాయి.

# ఎంతటి దుర్భర పరిస్థితి?

## చందా కొచ్చర్‌కు సుప్రీం కోర్టులోనూ తప్పని నిరాశ



దేశ బ్యాంకింగ్ రంగంలో ప్రత్యేక గుర్తింపుతో అగ్రస్థానానికి ఎదిగి సంచలనం సృష్టించిన ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో, ఎండీ చందా కొచ్చర్ కుంభకోణంలో ఇరుక్కుని కేసులను ఎదుర్కొంటూ తన పదవీ విరమణ ప్రయోజనాలు ఇప్పించాలని కోర్టుల చుట్టూ తిరుగుతోంది.

ప్రైవేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో, ఎండీ చందా కొచ్చర్ సుప్రీం కోర్టులోనూ తీవ్ర నిరాశే ఎదురైంది. బ్యాంకు నుంచి తన పదవీ విరమణ ప్రయోజనాలకు సంబంధించి చందా కొచ్చర్ దాఖలు చేసిన అప్పీల్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు డిసెంబర్ 8న నిరాకరించింది.
ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం చందా కొచ్చర్ గతంలో బాంబే హైకోర్టులో మధ్యంతర పిటిషన్ వేయగా డివిజన్ ??బెంచ్ తిరస్కరించింది. తాజాగా ఆ డివిజన్ బెంచ్ నిర్ణయాన్నే సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. కొచ్చర్ తరఫున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపించారు. బాంబే హైకోర్టు తీర్పు అన్యాయమని, బ్యాంకు మొదట్లో కొచ్చర్‌కు రిటైర్‌మెంట్ ప్రయోజనాలను అందించేందుకు అంగీకరించి తర్వాత వెనక్కితీసుకుందని ఆయన గుర్తు చేశారు. అయితే ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది.

ఈ ఏడాది మే నెలలో ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి పదవీ విరమణ ప్రయోజనాలను కోరుతూ ఆమె చేసిన మధ్యంతర దరఖాస్తును తిరస్కరించిన బాంబే హైకోర్టు డివిజన్ బెంచ్ సింగిల్ జడ్జి ఉత్తర్వును అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది.
ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో పదవి నుంచి చందా కొచ్చర్ తొలగింపును సమర్థించిన బాంబే హైకోర్టు దీనిపై ఆమె వేసిన పదవీ విరమణ ప్రయోజనాల కోసం? ఆమె వేసిన మధ్యంతర పిటిషన్‌ను గతేడాది నవంబర్‌లో కొట్టేసింది. 2018లో ఆమె దక్కించుకున్న 6.90 లక్షల షేర్లతో ఆమెకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది.
2018 మేలో తనపై విచారణ ప్రారంభం కాగానే చందా కొచ్చర్ సెలవుపై వెళ్లిపోయారు. ఆ తరువాత ముందస్తు రిటైర్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని ఆమోదించిన ఐసీఐసీఐ బ్యాంక్ టెర్మినేషన్ ఫర్ కాజ్‌గా పరిగణించి ఆర్బీఐ నుంచి అనుమతి కూడా కోరినట్లు తెలిపింది.

# 'చైనాకి యాపిల్ మరో భారీ షాక్!',

## డ్రాగన్ కంట్రీని వద్దనుకుని.. టాటా గ్రూప్‌తో

ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ ?కంపెనీకి భారీ షాకిచ్చినట్లు తెలుస్తోంది. ఐఫోన్‌ల తయారీ కోసం డ్రాగన్ కంట్రీపై ఆధారపడడం ఏమాత్రం ఇష్టం లేని యాపిల్ భారత్‌లో మరో ఐఫోన్ తయారీ కేంద్రాన్ని నిర్మించనుంది.

ఈ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్‌ను టాటా గ్రూప్ నెలకొల్పనుంది.



ఈ ఏడాది అక్టోబర్‌లో కర్ణాటక కేంద్రంగా భారత్‌లో ఐఫోన్‌లను తయారు చేసే విస్ట్రాన్ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్‌ను టాటా గ్రూప్ 125 మిలియన్ భారీ మొత్తాన్ని చెల్లించి కొనుగోలు చేసింది. అయితే, బ్లూంబెర్గ్ నివేదిక ప్రకారం.. తమిళనాడు హొసూర్ కేంద్రంగా టాటా గ్రూప్ అధినేత రతన్ టాటా రెండో ఐఫోన్ తయారీ యూనిట్‌ను ప్రారంభించే యోచనలో ఉన్నారని తెలిపింది.ఈ ఫ్యాక్టరీలో టాటా గ్రూప్ కనీసం 20 లైన్‌లో ఐఫోన్‌లను తయారు చేసేందుకు ప్రణాళికల్ని సిద్ధం చేసుకుందని, తద్వారా 50 వేల మందికి ఉపాధి అవకాశం కలుగుందని బ్లూంబెర్గ్ నివేదికలో పేర్కొంది. ఇక ఈ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్ 12 నెలల నుంచి 18 నెలల లోపల అందుబాటులోకి రానుందని అంచనా.



### చైనాకు భారీ షాక్

టెక్ దిగ్గజం యాపిల్ చైనాపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.ఫలితంగా చైనా కాకుండా మిగిలిన దేశాలైన భారత్, థాయిలాండ్, మలేషియాలలో ఐఫోన్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు స్థానిక కంపెనీలతో చర్చలు జరుపుతోంది. ఇందులో భాగంగా భారత్‌కు చెందిన టాటా కంపెనీ ఐఫోన్‌లు తయారు చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకుంది.

ఇప్పటికే భారత్‌లోని కర్ణాటక కేంద్రంగా ఐఫోన్‌లను మ్యానిఫ్యాక్చరింగ్ చేస్తున్న విస్ట్రాన్ కార్పొరేషన్‌ను టాటా కొనుగోలు చేసేలా పావులు కదిపింది. ఈ తరుణంలో విస్ట్రాన్ కాకుండా.. టాటానే సొంతంగా ఐఫోన్‌ల తయారీ కేంద్రాన్ని ప్రారంభించేలా యాపిల్.. టాటా గ్రూప్‌ను ప్రోత్సహించింది. ఆ చర్చలు చివరి దశకు రావడం.. దేశీయంగా టాటా మరో ఐఫోన్ తయారీ ఫ్యాక?రీని ఏర్పాటు చేసేలా పనులు వేగంగా జరుగుతున్నాయని బ్లూమ్‌బర్గ్ నివేదిక హైలెట్ చేసింది.



# బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు..

## గ్లెన్ ఫిలిప్స్ విరోచిత పోరాటం

ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. బ్యాటింగ్‌కు కష్టంగా ఉన్న పిచ్‌పై 88 పరుగులు చేసి జట్టును అదుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో 4 ఫోర్లు, 9 సిక్స్‌లు ఉన్నాయి. న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన ఫిలిప్స్ ప్రత్యరి బౌలర్లపై ఎదురుదాడికి దిగి.. తన జట్టుకు 180 పరుగులు గౌరవప్రదమైన స్కోర్‌ను అందించాడు.కాగా కివీస్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 37.1 ఓవర్లో 180 పరుగులకు ఆలౌటైంది. కివీస్ బ్యాటర్లలో ఫిలిప్స్‌తో పాటు జామీసన్(20), మిచెల్(18) పరుగులతో రాణించారు. బంగ్లా బౌలర్లలో స్పిన్నర్లు తైజుల్ ఇస్లా?ం, మెహదీ హసన్ మిరాజ్ తలా మూడు వికెట్లు పడగొట్టగా.. నయీం హసన్, షోర్‌ఫుల్ ఇస్లాం చెరో రెండు వికెట్లు సాధించాడు.
ఇక మూడో రోజు ఆటముగిసే సమయానికి బంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 38 పరుగులు చేసింది. వెలుతురు లేమి కారణంగా మూడో రోజు కేవలం 32 ఓవర్ల ఆటమాత్రమే సాధ్యపడింది. ప్రస్తుతం క్రీజులో జకీర్ హసన్(16), మోమినుల్ హక్(0) ఉన్నారు.

# సిక్స్ కొట్టకుండా ఒకే బంతికి 7 పరుగులు..

## వీడియో వైరల్



ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన పాకిస్తాన్ జట్టు.. కాన్‌బెర్రా వేదికగా ప్రైమ్ మినిస్టర్స్ ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్‌లో తలపడతోంది. అయితే ఈ వార్మప్ మ్యాచ్‌లో ప్రైమ్ మినిస్టర్స్ తొలి ఇన్నింగ్స్ మూడో రోజు ఆట సందర్భంగా విచిత్రకర సంఘటన చోటు చేసుకుంది.

కేవలం ఒక్క బంతికే చెత్త ఫీల్డింగ్ కారణంగా పాకిస్తాన్ జట్టు ప్రత్యర్థికి ఏడు పరుగులు సమర్పించుకుంది.

ఏమి జరిగిదంటే?
ఇన్నింగ్స్ 24 ఓవర్ వేసిన ఆఫ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ బౌలింగ్‌లో చివరి బంతికి రెన్షా కవర్స్ దిశగా షాట్ ఆడాడు. అయితే పాక్ ఫీల్డర్ మీర్ హమ్జా పరిగెత్తుకుంటూ వెళ్లి డైవ్ చేస్తూ బంతిని అద్భుతంగా ఆపాడు. ఈ క్రమంలో ప్రైమ్ మినిస్టర్స్ బ్యాటర్లు మూడు పరుగులను పూర్తి చేశారు. అయితే నాన్‌స్ట్రైక్‌లో ఎండ్‌లో బంతి అందుకున్న బాబర్ ఆజం.. అవసరం లేకుండా కీపర్ వైపు బలంగా త్రో చేశాడు.

ఈ క్రమంలో వికెట్ కీపర్‌తో పాటు ఫస్ట్‌స్లిప్‌లో ఉన్న ఫీల్డర్ కూడా బంతిని ఆపలేకపోయారు. దీంతో బంతి బౌండరీకి వెళ్లడంతో రెన్షా ఖతాలో ఏడు పరుగులు చేరాయి. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఇది చూసిన నెటిజన్లు పాకిస్తాన్‌తో అట్లుటంది మరి అని కామెంట్లు చేస్తున్నారు. కాగా ఈ పర్యటనలో భాగంగా ఆసీస్‌తో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో పాక్ తలపడనుంది. డిసెంబర్ 14న పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది.

# బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు..

## గ్లెన్ ఫిలిప్స్ విరోచిత పోరాటం





ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. బ్యాటింగ్‌కు కష్టంగా ఉన్న పిచ్‌పై 88 పరుగులు చేసి జట్టును అదుకున్నాడు.

అతడి ఇన్నింగ్స్‌లో 4 ఫోర్లు, 9 సిక్స్‌లు ఉన్నాయి. న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన ఫిలిప్స్ ప్రత్యరి బౌలర్లపై ఎదురుదాడికి దిగి.. తన జట్టుకు 180 పరుగులు గౌరవప్రదమైన స్కోర్‌ను అందించాడు.
కాగా కివీస్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 37.1 ఓవర్లో 180 పరుగులకు ఆలౌటైంది. కివీస్ బ్యాటర్లలో ఫిలిప్స్‌తో పాటు జామీసన్(20), మిచెల్(18) పరుగులతో రాణించారు. బంగ్లా బౌలర్లలో స్పిన్నర్లు తైజుల్ ఇస్లా?ం, మెహదీ హసన్ మిరాజ్ తలా మూడు వికెట్లు పడగొట్టగా.. నయీం హసన్, షోర్‌ఫుల్ ఇస్లాం చెరో రెండు వికెట్లు సాధించాడు.ఇక మూడో రోజు ఆటముగిసే సమయానికి బంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 38 పరుగులు చేసింది. వెలుతురు లేమి కారణంగా మూడో రోజు కేవలం 32 ఓవర్ల ఆటమాత్రమే సాధ్యపడింది. ప్రస్తుతం క్రీజులో జకీర్ హసన్(16), మోమినుల్ హక్(0) ఉన్నారు.

# ఆపద సమయాల్లో చేయూతనందిద్దాం – విజయ్

రజనీకాంత్ ఇల్లును చుట్టుముట్టిన వరదనీరు

మిగ్‌జాం తుఫాన్ తాకిడికి తమిళనాడు రాజధాని చెన్నై అతలాకుతలమైంది. భీకర గాలులు, కుండపోత వానతో చెన్నైలోని అనేక ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. నగరంలో కురిసిన భారీ వర్షాల ధాటికి జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షాలు తగ్గి రెండు రోజులు అయినప్పటికీ నగరం ఇంకా వరద ముంపులోనే ఉంది. చాలా ప్రాంతాల్లో వరద నీరు ఇంకా తొలగిపోలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యవసర వస్తువుల కొరత, కరెంటు, ఆహారం, నీరు లేక అల్లాడుతున్నారు. కేవలం సామాన్య ప్రజలే కాదు పలువురు స్టార్ సెలబ్రిటీలు కూడా ఈ వరదల్లో చిక్కుకున్నారు. ప్రముఖ స్టార్ నటుడు రజనీకాంత్ ఇంటిని కూడా వరద నీరు చుట్టుముట్టింది.. చెన్నైలోని పోయెస్ గార్డెన్ ప్రాంతంలో ఉన్న రజనీ ఇంటి బయట భారీగా వరద నీరు నిలిచిపోయింది. నీటి ఎద్దడి కారణంగా ఆ ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రజనీకాంత్ ఇంటి వద్ద వరదనీటికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# తారక్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్

## డంకీ, సలార్ సినిమాలతోపాటు దేవర టీజర్?



టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ హీరోగా.. కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'దేవర'. ఈ చిత్రంతో శ్రీదేవి గారలపట్టి జాన్వీకపూర్ తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అవుతుంది. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తొలిభాగం 2024 ఏప్రిల్ 5న విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి తారక్ లుక్‌తో పాటు, సైఫ్ అలీఖాన్, జాన్వీకపూర్ లుక్‌లను రిలీజ్ చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమా టీజర్ ఎప్పుడు వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ తారక్ ఫ్యాన్స్ వెయ్యి కండ్లతో ఎదురు చూస్తున్నారు. అయితే ఈ టీజర్‌పై ఒక సాలిడ్ న్యూస్ బయటకు వచ్చింది. దేవర టీజర్‌ను డిసెంబర్ 25న కానీ లేదా జనవరి 1 విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియాలో టాక్ నడుస్తుంది. అయితే లేటెస్ట్‌గా దేవర టీజర్‌ని డిసెంబర్ 22న విడుదల కానున్న రెండు పాన్ ఇండియా సినిమాలు సలార్, డంకీ సినిమాలతో థియేటర్స్‌లో విడుదల చేయనున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం దేవరకి సాలిడ్ రీచ్ దొరికేసినట్లే. ఓవర్సీస్‌లో డంకీ సినిమాకి, ఇండియాలో సలార్ సినిమాకి సాలిడ్ బజ్ ఉంది కాబట్టి ఈ సినిమాలకి పాటు దేవర టీజర్ అటాచ్ చేస్తే బాగుంటుంది అని మేకర్స్ అలోచిస్తున్నట్లు సమాచారం. కాగా దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# యానిమల్ సినిమాపై అల్లు అర్జున్ ప్రశంసల జల్లు



మొదటిరోజు నుంచే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్‌ను పరుగులు పెట్టిస్తుంది. మొదటిరోజు ఈ సినిమా రూ.116 కోట్లు వసూలు చేయగా.. రెండో రోజు ఏకంగా రూ.236 కోట్లు వసూలు చేసింది. ఇక మూడో రోజు వరల్డ్‌వైడ్‌గా రూ.356 కోట్లు వసూళ్లు రాబట్టింది. తాజాగా ఈ చిత్రం రూ.563 కోట్లతో దూసుకుపోతుంది. ఇక ఇప్పటికే ఈ సినిమా చూసిన పలువురు సినీ ప్రముఖులు యానిమల్‌పై రివ్యూలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా చూసిన టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చిత్ర యునిట్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. యానిమల్ సినిమా జస్ట్ మైండ్ బ్లోయింగ్ అని.. ఆ సినిమాటిక్ బ్రిలియన్స్ పిచ్చెక్కించిందని ట్విట్టర్ వేదికగా తెలిపాడు. రణబీర్ కపూర్ ఇండియన్ సినిమా ఎక్స్ పీరియన్స్‌ను వేరే లెవల్ కు తీసుకువెళ్లావు. చాలా స్ఫూర్తిదాయకంగా ఉంది. మీ మ్యాజిక్‌తో నా నోట మాటలు రావడం లేదు. రష్మిక, బ్రిలియంట్ గా నటించావ్ ఇప్పటి దాకా నీ బెస్ట్ పెర్ఫార్మన్స్ ఇది, ఇంకా ఇలాంటివి మరెన్నో చేయబోతున్నావని అర్థం అవుతోంది. బాబీ డియోల్ మీ నటన మమ్మల్ని సైలెంట్ చేసింది, మీ టెరిఫిక్ నటనకు నా రెస్పెక్ట్. యంగ్ హీరోయిన్ తృప్తి గుండెలను బ్రేక్ చేస్తోంది, ఇంకా చేస్తుందని భావిస్తున్నాను. మిగతా అందరు నటీనటులు, టెక్నీషియన్లు కూడా సినిమాను మరో లెవల్‌కి తీసుకు వెళ్లారు, వాళ్లందరికీ కంగ్రాట్స్. సందీప్ రెడ్డి వంగా జస్ట్ మైండ్ బ్లోయింగ్. మీరు అన్ని సినిమా పరిమితులను అధిగమించారు, మీరు మరోసారి మా అందరినీ గర్వపడేలా చేశారు. మీ సినిమాలు ఇప్పుడు మరియు భవిష్యత్తులో భారతీయ సినిమా ముఖచిత్రాన్ని ఎలా మార్చబోతున్నాయో నేను స్పష్టంగా చూడగలనని అల్లు అర్జున్ రాసుకొచ్చాడు. కాగా ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# భారీ కేక్‌ను కట్ చేసిన బాలీవుడ్ సినీ దిగ్గజం

బాలీవుడ్ లెజెండరీ నటుడు ధర్మేంద్ర శుక్రవారం తన 88వ జన్మదినోత్సవం జరుపుకున్నారు. ధర్మేంద్ర బర్త్‌డే సందర్భంగా జుహులోని ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో అభిమానులు చేరుకున్నారు. తండ్రి ధర్మేంద్ర బర్త్‌డే సందర్భంగా ఆయన కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్ శుభాకాంక్షలు తెలిపారు. కుమారుల సమక్షంలో ధర్మేంద్ర భారీ బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. సినీ పరిశ్రమలో దిగ్గజాల వంటి దర్శక నిర్మాతలతో పనిచేసిన ధర్మేంద్ర తన సుదీర్ఘ సినీ కెరీర్‌లో ఫూల్ ఔర్ పత్తర్, షోలే, చుప్కే చుప్కే, యాదోంకీ బారాత్, సీతా ఔర్ గీఆ, ధరంవీర్ వంటి పలు హిట్ చిత్రాల్లో నటించారు. హేమమాలిని, మీనా కుమారి, సైరా బాను వంటి ప్రముఖ నటీమణులతో ఆయన స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఇక ధర్మేంద్ర చివరి సారిగా కరణ్ జోహార్ రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహాని మూవీలో రణ్‌వీర్ సింగ్ తాతగా కనిపించారు.




## ఒక్క డైలాగ్‌కు పడిపోయా : కియారా అద్వాణీ

ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహమాడింది అగ్ర కథానాయిక కియారా అద్వాణీ. 'షేర్షా' చిత్రంలో వీరిద్దరూ కలిసి నటించారు. అక్కడే ఈ జంట మధ్య ప్రేమ చిగురించింది. అనంతరం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల 'కాఫీ విత్ కరణ్' షోలో పాల్గొన్న కియారా అద్వాణీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. భర్త సిద్ధార్థ్ మల్హోత్రా తనకు లవ్ ప్రపోజ్ చేసిన క్షణాలను గుర్తుచేసుకుంది. ఆమె మాట్లాడుతూ 'సిద్ధార్థ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓసారి రోమ్ టూర్‌కు వెళ్లాను. అక్కడ ఓ రోజు క్యాండిల్ లైట్ డిన్నర్ చేసిన తర్వాత రోమ్ వీధుల్లో సరదాగా నడుచుకుంటూ వెళ్తున్నాం. అప్పుడు ఓ వ్యక్తి మా దగ్గరకు వచ్చి వయోలిన్ ప్లే చేస్తూ పాట వినిపించాడు. వెంటనే సిద్ధార్థ్ మోకాళ్లపై కూర్చొని 'షేర్షా' సినిమాలోని 'ఢిల్లీ కా సీదా సాదా లుండా హూ' (ఢిల్లీకి చెందిన ఓ సాధారణ అబ్బాయిని) అనే డైలాగ్ చెప్పి లవ్ ప్రపోజ్ చేశాడు. ఏదో తెలియని ఆనందంలో వెంటనే ప్రేమకు అంగీకారం తెలియజేశా. మా స్నేహితుడొకరు ఈ సంఘటనను ఆ వీడియో తీశారు. నా జీవితంలో చిరకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకమది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది.

# వాటితోనే ప్రపంచాన్ని మార్చగలం:

## సమంత పోస్ట్ వైరల్!



## యానిమల్‌లో ఆ సన్నివేశం గురించి ఆమె ఏం చెప్పిందంటే



త్రిప్తి డిమ్రి పేరు ఇప్పుడు ప్రతి దగ్గరా మారుమోగుతోంది. ఆమె అగ్ర నటి అని కాదు, లేదా ఆమె కథానాయకురాలిగా చేసిన సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర పెద్ద విజయం సాధించింది అని కాదు. ఆమె 'యానిమల్' చంనితిఎజీశ్రీ సినిమాలో చేసిన ఒక బోల్డ్ సన్నివేశంతో ఆమె పేరు మారుమోగిపోతోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' సినిమాలో రణబీర్ కపూర్, రష్మిక మందన్న జంటగా నటించారు. ఈ సినిమాలో రెండో సగంలో రణబీర్ కపూర్ తో త్రిప్తి డిమ్రి కనిపిస్తుంది. అందులో భాగంగానే ఒక సన్నివేశంలో రణబీర్ తో పాటు త్రిప్తి నగ్నంగా కనిపిస్తారు. అలాగే ఇది ఒక బోల్డ్ సన్నివేశం. దీని గురించి త్రిప్తి ఇంతవరకు మాట్లాడలేదు, ఇప్పుడు మాట్లాడుతున్నారు. కానీ రెండో రోజు నుంచీ ఆమె గురించి అందరూ ఆరా తీయడం మొదలెట్టారు అని చెప్తోంది.

# రామ్‌చరణ్‌ను కలిసిన నెట్‌ఫ్లిక్స్ కో.సిఇఓ ఫొటోలు వైరల్

టాలీవుడ్ దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ చిత్రం భాషతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా అదరగొట్టింది. ఆడియన్స్ ను మెప్పించడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. ఎన్నో అంతర్జాతీయ అవార్డులను కొల్లగొట్టింది. అంతేకాదు, భారతీయ సినిమా ఖ్యాతిని 'ఆర్ఆర్ఆర్' చిత్రం ఆస్కార్ వేదిక వరకూ తీసుకెళ్లి ంది. ఈ చిత్రంలోని 'నాటు నాటు' పాట ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. అయితే ఈ చిత్రం ఆస్కార్ స్థాయిలో వెలుగులు విరజిమ్మిన నేపథ్యంలో టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఫేమ్ అంతర్జాతీయ స్థాయికి చేరింది. హాలీవుడ్ నుంచి కూడా రామ్ చరణ్‌కి ఆఫర్స్ వెల్లువలాగ వస్తూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా నెట్‌ఫ్లిక్స్ కో–సీఈవో టెడ్ సరాండొస్ గురువారం హైదరాబాద్‌లో అడుగుపెట్టి నేరుగా టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నివాసానికి విచ్చేశారు. ఇక ఈ భేటీలో రామ్ చరణ్‌తో పాటు మెగాస్టార్ చిరంజీవి, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ నిర్మాత శోభు యార్లగడ్డ తదితరులు ఉన్నారు. వీరందరితో టెడ్ సరదాగా కాసేపు ముచ్చటించారు. అనంతరం భారత్‌లో తమ తదుపరి ప్రణాళికల గురించి, వ్యాపార విస్తరణ, సినిమాలు తదితర అంశాలపై చర్చించారు. ఇక ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు.. ఈ భేటీ క్యాజువల్‌గా జరిగిందా.. ఏదైనా ప్రాజెక్టు కోసం జరిగిందా అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



# ప్రియుడితో ఎంగేజ్‌మెంట్ చేసుకున్న స్టార్ నటుడి కూతురు!




మాలీవుడ్ స్టార్ కపుల్ జయరామ్, పార్వతిల కూతురు మాళవిక నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు సంబంధించిన వీడియో, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తన ప్రియుడైన నవనీత్ గిరీష్‌తో మాళవిక ఎంగేజ్‌మెంట్ చేసుకుంది. కాగా.. ఇటీవలే మాళవిక ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తమ రిలేషన్ గురించి అఫీషియల్‌గా ప్రకటించారు. ప్రియుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ అతన్ని అభిమానలకు పరిచయం చేసింది.కాగా.. ఆమె తల్లిదండ్రులైన జయరాం, పార్వతి ఇద్దరు నటీనటులే. ఆమె తండ్రి జయరాం టాలీవుడ్ మూవీలోనూ నటించారు. అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన అల వైకుంఠపురములో చిత్రంలో జయరాం కీలక పాత్ర పోషించారు.